నేనిచ్చు నీళ్ళు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్ళు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటిబుగ్గగా ఉండును -యేసు

# హన్వాక్షుప

ఆధ్యాత్మిక మాస పత్రిక



ఫిబ్రవరి - 2009

## విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| చాలని నేను- | కంచర్ల ప్రభుదాసు, నెల్లూరు | 4 |
| నిత్యజీవజలము | నిత్యజీవజలము మాసపత్రిక సౌజన్యంతో | 6 |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్, ఒంగోలు | 8 |
| మహాయజ్ఞము | రెవ.డా॥బి.శాంసన్, చెన్నై | |
| | రెవ.డా॥పి.జె.పంచరత్నం, నంద్యాల | 10 |
| అత్యంత ప్రియమైన అమ్మ | శ్రీమతి బి.విమలారెడ్డి, హైదరాబాద్ | 12 |
| మదర్ తెరీసా | శ్రీయడవల్లి ప్రసాదరావు, హైదరాబాద్ | 14 |
| విశ్వాసంలో ఓ మెట్టు | కొడవటికంటి | 16 |
| ఫిబ్రవరి నెల ప్రశ్న | హన్నాకృప డెస్క్ | 18 |
| ఇది పరిశుద్ధాత్మయేనా? | శ్రీ డేవిడ్ మింగ్స్, బైబిల్ ఉపదేశిని, చెన్నై | 19 |
| ఆ రాత్రి చేసిన పాపమే... | డా॥పి.సతీష్‌కుమార్, హైదరాబాద్ | 20 |
| దేవునితో సమాధానపడుట.. | శ్రీమతి బి. విమలారెడ్డి, హైదరాబాద్ | 22 |
| అమృతధార | డా॥ కె. డేవిడ్‌లివింగ్‌స్టన్, మార్కాపురం | 24 |
| సాక్ష్యము | వైస్‌ఛాన్సలర్ మద్దెల ఏబెలు, చెన్నై | 26 |
| సాక్ష్యము | పాస్టర్ రెబ్బా ప్రసాదరావు, రేపల్లె | 28 |
| సువార్తలలోని యేసు కథ | కొడవటికంటి | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



**చిరునామా :**

**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

చీఫ్ ఎడిటర్

**హన్నాకృప**

పోస్ట్‌బాక్స్ - 51, 54-1-23(ఎ)

కృపాదానంవీధి, క్లొపేట,

6వ లైను, ఒంగోలు- 1.


**హన్నాకృప**

**ఆధ్యాత్మిక మాస పత్రిక**

# HANNA KRUPA

**Christian Devotional Monthly Magazine**


**సంపుటి : 7** **సంచిక : 9**


**ప్రభువగు యెహోవాయే నాకు బలము**


Founder :

**Kodavatikanti Emmanuel Rajendra,** B.A.,B.L.,

Editor :

**Nathaniel R. Kodavatikanti,** B.Th.,M.A.,(M.Phil)

Cell : 9908822365

Hon. Editor :

**A.N.R. Zakkam**

D.G.M., SOMA Enterprises, Rajasthan

Hon. Advisor :

**Yadavalli Prasada Rao**

D.A.O.,G.H.M.C., Hyderabad

Patrons :

**Dr. Y.S. Purushotham Reddy**

Superintendent, Rajareddy Hospital Pulivendula

**Rev. Dr. K. Joseph**

Director, I.E.R.F. Ongole

**Rev. Dr. M.S. Santhavardhan**

Director, Good News Messengers, Guntur


**ఆన్‌లైన్ అకౌంట్ నెం. : 10957294362**

**బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

**కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లొపేట, ఒంగోలు**

**సెల్ : 9866716506**

సంపాదకీయం

# నా కుటుంబము

మానవుడు ఈ భూమి మీద కుటుంబము ఏర్పరచుకొనిన నాట నుండి నేటి వరకు జ్ఞానములోను, ధనములోను కుటుంబము ఏర్పాటు చేసుకున్న వారందరిలో మొదటి స్థానము రాజైన సొలొమోను అగ్రజుడు. అతనికి వెయ్యి కుటుంబాలు. అయినా ఒక్కడే కుమారుడు రెహబాము. సొలొమోనుకు సంవత్సరమునకు 21 టన్నుల బంగారం వస్తుంది. అయినా తన రాజ్యంలో కొన్ని గ్రామాలను తూరు రాజునకు అమ్ముకున్నాడు. చివరికి దేవుడు రెండుసార్లు అతనిని హెచ్చరించినా మారుమనసు పొందకుండా భ్రష్టునిగా చనిపోయాడు. ఇశ్రాయేలీయులు అందరూ ఒక్క కుటుంబమే. ఈ భ్రష్టుడైన సొలొమోను వలన ఆ కుటుంబము రెండుగా చీలిపోయింది.

దావీదు యుద్ధాలు చేసి లోకమంతటిని జయించగలిగాడుగాని తన కడుపున పుట్టిన బిడ్డను చూసి పారిపోవడానికి కారణం అతడు చేసిన పాపమే.

యాకోబు తన చేతికర్రతో యొర్దాను దాటి పద్దనరాము వెళ్ళి కోట్లాది ఆస్తి దేవుని దీవెన ద్వారా సంపాదించాడు. రాత్రంతా దేవునితో పెనుగులాడి ఆశీర్వాదము సంపాదించాడు కాని బేతేలుకు వెళ్ళమని దేవుడిచ్చిన ఆజ్ఞను మీరి షెకెమునకు వెళ్ళి పది సంవత్సరాలు దేవునికి దూరంగా జీవించినందు వలన తన కుటుంబమంతా పతనమైపోయింది. ఒక్కగానొక్క కుమార్తె చెరచబడింది. పెద్ద కుమారుడు వ్యభిచారి అయ్యాడు. తన కుమారులందరు హంతకులయ్యారు. తన భార్య కూడ వ్యభిచరించింది. తన కుటుంబమంతా ప్రాణాపాయంలో పడిపోయారు. కారణం తను దేవునికి లోబడక పోవడమే. దీనంతటికి కారణం తన కుటుంబము మీద తనకు పట్టు లేకపోవడమే. తర్వాత దేవునికి లోబడి తన ఇంటి వారందరి దగ్గరి నుండి విగ్రహాలు తీసి వేయించిన తర్వాత కుటుంబాన్ని సరైన పద్ధతిలో నడిపించసాగాడు.

వేగంగా మారిపోతున్న నేటిలోకంలో నిలబడి ఆలోచించే వారు చాలా తక్కువగా ఉన్నారు. లోకాన్నంత మనం బాగు చెయ్యలేము, ఆపలేము. కాని ఎవరికి వారు ఎవరింట్లో వాళ్ళు రోజూ కొంచెం సమయం తన ఇంట్లో తన బిడ్డలతోటి భార్యతోటి సమయం వెచ్చిస్తే ఒక్క నెలలోనే ఫలితం కనిపిస్తుంది.

యాజకుడైన ఏలీతో - నాకంటే నీ కుమారులను నీవు గొప్ప చేయుచున్నావు అంటున్నాడు దేవుడు. ఏలీని హెచ్చరిక చేసిన తర్వాత ఇరవై ఐదు సంవత్సరాలకు ఆయన దగ్గర్నుండి ఏలీ కుటుంబమునకు శిక్ష వచ్చింది.

చిన్నతనము నుండి ఏలీ కుటుంబము సంగతి దగ్గర వుండి చూసిన సమూయేలు కూడ తన కుమారులను దేవునిలో పెంచలేదు. అందువలన ఇశ్రాయేలు జనులు తమ రాజైన దేవుని విడిచి మాకు ఒక రాజును ఇవ్వమని సమూయేలును అడిగారు.

బైబిలు గ్రంథమంతా మన చరిత్రే. ఆ రోజుల్లో వారికి బైబిలు లేదు. టి.వి. ప్రసంగాలు లేవు. ఇప్పుడు మనం మన కుటుంబముతో ఎంతసేపు కాలం గడుపుతామో ఆ కుటుంబము మీద మనకు పట్టు వుంటుంది.

వృద్ధాప్యము కొరకు ఇన్స్యూరెన్స్ చేస్తాము. డబ్బు బ్యాంకులో వేస్తాము. కాని మన కుటుంబములోనే మన బిడ్డలు మన మరణ దినము వరకు మనల్ని అంటి పెట్టుకొనే విధంగా మనం పెంచుకుంటే భవిష్యత్తు విషయం భయపడ నవసరం లేదు. బిడ్డలను దేవునికి భయపడే విధంగా మనం వాళ్ళని పెంచితే అటువంటి బిడ్డలు తల్లిదండ్రులను ఎప్పుడూ ప్రేమిస్తూనే ఉంటారు.

ఇరవై లక్షలకు పైగా ఉన్న ఇశ్రాయేలు జనాంగమునకు నాయకుడైన యెహోషువ తన కుటుంబములోని వారందరి మానసిక ప్రవర్తన బాగుగా ఎరిగియున్నవాడు. కాబట్టి అంతమంది జనాంగముతో "మీరెవరిని సేవింప కోరుకొనిననూ నేను **నా యింటి వారును** యెహోవాను సేవించుదుము" అన్నాడు.

సాక్ష్యము

# చాలని నేను - చాలిన నా ప్రభువు

2

( రెవ. కంచర్ల ప్రభుదాసు )

ఆ ప్రాంతపు ధనిక సంపన్న వర్గాలు తాము పండించిన జొన్నలను వేరే ప్రాంతములకు అమ్ముటకు సరుకును లారీలలో తీసుకొని వెళ్ళుచుండగా, ఇక్కడ వ్యక్తులు గొడ్డళ్ళు, బాకులు, కత్తులు మరియు ఈటెలు తీసుకొని వారిపై దాడి చేసి మొత్తము సరుకు దోచుకొని పోయి పంచుకొనినారు. వారు తీసుకున్న జొన్నలకు మరలా డబ్బులను చెల్లించుటకు ప్రామిసరీ నోటు వ్రాసి ఆ ధనిక వర్గము వారికి ఇచ్చినారు. అటువంటి ప్రజల మధ్య మేము సేవను ప్రారంభించాము. ఆ ప్రభువైన యేసు మాకు తోడు నీడగా వుండి మమ్ములను ముందుకు నడిపించాడు. మేము వరి అన్నము అన్నది ఎరుగక జొన్న అన్నం, రాగి సంగటి వంటి వారి భోజనములకే అలవాటు పడినాము. ఆ ప్రాంతములో సమీపంగా ఒక వాగు ఇసుక తిన్నెలు వుండేవి. ప్రతి శుక్రవారము రాత్రి కూడికతో కొద్దిమంది కలిసి సంపూర్ణ రాత్రి ప్రార్థన చేయుచుంటిమి. ఈ అనుభవములు మా పరిచర్యలో ప్రభువునందు బలపడుటకు దోహదపడ్డాయి.

1969లో క్రిస్మస్ రోజులలో ఆళ్ళగడ్డ తాలూకాలోని కోటపాడులో తెల్లవారు జామున కోయలగుడ తాలూకా రాయపాడులో మధ్యాహ్నం క్రిస్మస్ ఆరాధన జరిపినాము. సుమారు 24 మైళ్ళ కాలినడకలో సంచరిస్తూ వెళ్ళే బలాన్ని దేవుడు మాకు అనుగ్రహించాడు. జీతభత్యములు లేకపోయినా మమ్ములను పిలిచిన దేవుడు ఎంత నమ్మదగిన వాడో ఆ దినములలో జుంటితేనెలను మించిన తన ప్రేమను మేము రుచి చూచినాము. అనేకమంది యౌవనస్తులు ముందుకు వచ్చారు. అందులో ఒకరు ఇప్పుడు నంద్యాలలో పరిచర్య చేయుచున్న రెవ.జి.డేవిడ్‌పాల్‌గారు. 1970లో డా॥ టి.జి. గ్రిప్సన్‌గారి వద్ద నుండి మాకు ఒక లేఖ వచ్చింది. అందులోని సారాంశము రాయలసీమకు తల్లి సంఘముగా పిలువబడే కర్నూలు ఆత్మకూరులోని సంఘము మూడు సంవత్సరాల నుండి తగాదాలతో మూయబడి ఏ పండుగ చేసుకోకుండా చాలా ప్రమాదమైన స్థితిలో ఒకరిని ఒకరు దూషించుకుంటూ, హింసించుకొనుచున్నవారి వద్దకు వెళ్ళి ఎలాగైనా ప్రార్థనతో వారిని సరిచేసి గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌లను జరుపమని కోరినారు. నేను బుధవారము బయలుదేరి వెళ్ళాను. అక్కడ వారి వాదనలు విన్న నాకు సరిచేయడం ఎంతో కష్టముగా అనిపించింది. ఆ రాత్రి చర్చి వరండాలో మోకరిల్లి సంఘమును సరిచేయమని ప్రార్థనలో గోజారినాను. ఎంతో శ్రమతో కూడుకున్నదైనా కూడా ఆ పరిశుద్ధాత్మ దేవుడు గొప్పకార్యము చేసినాడు. అందరూ సమాధానపడి మూడు సంవత్సరాల అనంతరం సంఘము తెరువబడినది. ఆ సంఘములో గుడ్‌ఫ్రైడే రోజున నేను ఏడు మాటలు మాట్లాడగలిగినాను. తరువాత ఆదివారం ఈస్టర్ ఆరాధన జరిపించి మరలా తిరిగి రాయపాడు వెళ్ళినాను. కాపరిలేని ఆత్మకూరు సంఘము వారు నన్ను కాపరిగా పంపమని టి.జి.గ్రిప్సన్‌గారికి మనవి చేసినారు. ఆయన పాల సంఘము వారితో సంప్రదించి 1970 జూన్‌లో నన్ను ఆత్మకూరు సంఘానికి కాపరిగా పంపినారు. ఆత్మకూరు సంఘము వారు వారి సంఘమునకు అభిషేకింపబడిన కాపరి కావాలి కనుక మా కాపరిని అభిషేకించవలసినదిగా రాయలసీమ తల్లి సంఘమునకు మనవిచేయగా, 1971 ఏప్రిల్‌లో అభిషేక కార్యక్రమము ఏర్పాటు చేశారు. ఆ మూడు దినములు కరివేణలో గంభీరమైన ఉజ్జీవ సభలు జరిగినవి. ఆఖరిదిన సభలో నన్ను అభిషేకించుటకు, అధ్యక్షులుగా డా॥ టి.జె.గ్రిప్సన్‌గారు, అభిషేక సందేశము ఇచ్చుటకు రెవ.డా॥ గద్దల సాల్మన్‌గారు, సంఘమునకు హెచ్చరికలు ఇచ్చుటకు రెవ. కె.ఆర్, మోజస్‌గారు, ప్రతిష్ఠ ప్రార్థన చేయుటకు రెవ. ఆర్. సామ్యేల్‌సాధుగారు, మరియు రాయలసీమలోని పలు సంఘముల నుండి 59 మంది కాపరులు హాజరయ్యారు. మిషనరీ ప్రతినిధిగా డా॥ రూత్ ధర్మండ్ మిషనరీ అమ్మగారు హాజరయ్యారు. ఈ దీనునికి అడగకనే పొందిన ఈ గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని కలుగజేసిన యేసునకు నేనేమిచ్చి కృతజ్ఞతలు చెల్లింతును. నా తుది శ్వాస వరకు ఆయనను మహిమపరచగలిగినా ఆయన ఋణము తీర్చగలనా!

ఆ ప్రదేశములో మేము పరిచర్య చేయు సమయములో నల్లమల్ల కొండ లోయలో సిద్ధపురము సెటిల్‌మెంట్ అనే ప్రాంతములో పరిచర్య చేశాము. సిద్ధపురము సెటిల్‌మెంట్‌లో ఒక మందిరము కట్టబడింది. ఆ మందిరము ప్రతిష్ట

సమయంలో "నా మందిరము ప్రార్ధన మందిరము అని ప్రభువైన యేసు ప్రబోధించాడు. దొంగల గుహగా మార్చ కూడదు" అని సందేశమిచ్చి రిబ్బన్ కత్తిరించాను. ఆ సమయంలో ఆ ప్రదేశములో అదే వృత్తిలో కొనసాగుతున్న ఇద్దరు యౌవనస్తులను నేను ఆదివారపు ఆరాధనలో చేసిన ప్రసంగము గద్దించింది. దానికి వారు సంఘాలతో మమ్ములను గూర్చి మాట్లాడతాడా అంటూ, మేము ఏమి చేస్తామో చూడండి అంటూ ఛాలెంజ్ చేశారట. వారు మీపై పగ బూని ఏదో చేయాలని ప్రయత్నిస్తున్నారని సంఘస్థులు మాకు తెలియజేశారు. అయినా మేము భయపడక అడవిలో సంచ రిస్తున్నప్పుడు సహితము వారి ప్రయత్నములు ఫలించలేదు. "మిమ్ము కాపాడు వాడు కునుకడు, నిద్రపోడు" అని వాక్యంలో చెప్పిన రీతిగా మమ్ము కాపాడినాడు. మమ్ములను వారు ఏమి చేయలేక ఒకనాటి రాత్రి మా గృహములో మేము బయట నిద్రిస్తున్న సమయంలో ఆ ఇద్దరు వ్యక్తులు ఇంటి వెనుక వైపు నుండి కన్నంవేసి లోపలికి ప్రవేశించి సమస్తమును దొంగిలించి ఇంటిని శుభ్రముగా చిమ్ము చీపురుతో సహా తీసుకెళ్ళారు. అయితే సంఘస్తులు విషయం తెలుసుకుని మా వద్దకు వచ్చి పోలీసు కేసు పెట్టమని ఎంతో బలవంతము చేశారు. కాని మేము వారిని దేవునికి అప్పగించి కేసు పెట్టలేదు. ఆనాటి నా ఆత్మబలము బలహీనపడుతుందేమో అని ఆయా సమయాలలో నన్ను నేను పరీక్షించుకొనుచూ వుంటాను. ఆశ్చర్యకరుడైన ప్రభువు మాకు పది దినములలోనే మేము పోగొట్టుకొన్న వాటికంటే పదింతలు సమకూర్చినాడు. మేము ఆ ఇద్దరు వ్యక్తులను గూర్చి మారుమనస్సు పొందాలి అని ఎంతగానో ప్రార్ధించాము. కాని వారిలో ఒక వ్యక్తి దోర్నాలలోని ఒక ఇంటికి కన్నం వేస్తూ భయకంరంగా కొట్టబడి చంప బడ్డాడు. మరొకని భార్య అతనిని విడిచి వెళ్ళిపోయింది. అతని కాలు తీసివేయబడింది. అతను పశ్చాత్తాపపడి నాకు క్షమాపణ చెప్పాడు.

మేము ఆత్మకూరు ప్రాంతంలో సువార్త దండయాత్ర జరిపించి ప్రతి గ్రామమునకు సువార్త అందించగలిగాము. ఆ పరిచర్యలో గుంటూరు వారి గార్డెన్‌లో దైవకృపాకర్‌రావు అనే చౌదరి కుటుంబము బాప్తిస్మము తీసుకుని రక్షింపబడి ప్రభువులోనికి వచ్చాడు. ఆనాటి మా క్వయర్ బిడ్డలు ఎంత గానో ఆశీర్వదించబడి మంచి మంచి ఉద్యోగాలలో అలంకరిం పబడినారు. మేము కాపరులము ఆ ప్రాంతపు సేవకు మూడు సంవత్సరాలకొకసారి చీట్లు వేసుకుని ఎవరికి ఏ ప్రాంతం వస్తుందో ఆయా ప్రాంతాలలో సేవ చేసేవారము. 1973 ఆగష్టు నెలలో మేము చీట్లు వేసుకోగా నాకు సిమెంటునగర్ వచ్చింది. సిమెంట్‌నగర్ పాణ్యం దగ్గర వున్న కొండలలో ఒక ఎత్తైన కొండ మీద వున్న ఒక ఊరు దగ్గరలో ఒక సిమెంట్ ఫ్యాక్టరీ వుంది. అక్కడ పెద్ద పాక వేయబడి అందులో ఆరాధన జరుగుతుండేది. అక్కడ వాతావరణం చాలా భయంకరం. అక్కడ అడవులలో అనేక క్రూరమృగాలు వుండేవి. జ్వరాలు కూడ వస్తుండేవి. అయినా ప్రభువు చిత్తం వరకు నిలబడాలి అని నిశ్చయించుకున్నాను. ఆ కొండపై పాకలు వేయబడిన స్థలములో ఒక రోజు ప్రార్ధన జరుగుచుండగా ఒక కట్లపాము నా వీపు మీదకెక్కి పాకుతూ ఎద మీద పాకి సగం నేలపై సగం నాపై వుండి అలాగే పదినిమిషాలు వుంది. అయినా నేను ఓర్చుకొనలేక కదలకుండా వుండలేక ఒక్క ఉదుటున నా చేతిని విసరగా అది నా భార్యపై పడి జరజర ప్రాకుచూ పోవుచుండగా అక్కడి వారు దానిని కొట్టి చంపారు. ఈ సంఘటన అకస్మాత్తుగా జరుగుట వలన నా భార్య రెండు గంటలసేపు మాట్లాడలేకపోయింది. ఆశ్చర్యకరుడు అయిన రక్షకుడు ఆ విషసర్పపు కోరల బారి నుండి మమ్ములను కాపాడాడు.

మరోసారి వెలుగోడు దగ్గర ఒక తండాలో పరిచర్య అనంతరం మేము చాప మీద నిద్రించి తెల్లవారు జామున లేచి చాప విదిలించగా దాని నుండి పసుపు, నలుపు చారలు గలిగి మూర పోడవు కలిగిన అడవి జెర్రి క్రింద పడినది. గొప్ప దేవుడు మాకు తోడై వున్నందున ఆ రాత్రంతా చాప క్రింద వున్న జెర్రి మమ్ము తాకటానికి అనుమతి లేదు. మేము సిమెంటు నగర్‌లో వున్న సమయంలో నంద్యాల పాల సంఘ పరిచర్య కార్యదర్శిగా సువార్త విస్తరీకరణ బాధ్యత మాకు అప్పగించబడింది. ఆ సమయంలో డా॥ స్టాంగర్ మిషనరీ ద్వారా అమ్మివేయబడిన స్కూలు ద్వారా ఏ విధముగానైనా విద్యా పరిచర్య కొనసాగించాలి అని మాలో ఆశ ఏర్పడి ప్రార్ధించి విజయం సాధించాము. ఆ స్కూలు పేరు రెవ.స్ట్రాంగర్ మెమోరియల్ స్కూలు. ఈ స్కూలు నంద్యాల రైల్వేస్టేషన్ దగ్గర గోడౌన్స్ వెనుక స్థాపించి, ఇద్దరు టీచర్లను పెట్టి ఏడు సంవత్స రాలు స్కూలు కరస్పాండెంట్‌గా వుండి, స్కూలు విషయంలో పెద్దల సహకారం టీచర్లకు స్వల్పజీతాలు ఇవ్వడానికి స్నేహితుల యొక్క సహకారము అందుకుని స్కూలు నిలుపగలిగాను.

(సశేషం)

# నిత్యజీవజలము



నిజమే కదా! ఈ వాక్యమును చదివి అర్థం చేసుకున్న వారు దాని ఔన్నత్యమును గ్రహించి ఆత్మీయ మేలులు పొందుతారు. కీర్తనాకారుడు 119 కీర్తన 103-105 వచనములలో వాక్యము ఆయన జిహ్వకు ఎంతో మధురముగా ఆయన నోటికి తేనెకంటే తీపిగాను పాదములకు దీపము త్రోవకు వెలుగుగానున్నట్లు వ్రాస్తున్నాడు. అదే వాక్యము తనను బ్రతికించునని (25వ) తనను స్థిరపరచునని (28వ) తన అడుగులను స్థిరపరచునని (113వ) దుష్టమార్గములన్నిటిలో నుండి తొలగించునని వ్రాస్తున్నాడు. ఇంకా చెప్పాలంటే ధర్మ శాస్త్రములో ఉన్నట్లయితే తమ అడుగులు జారవని (37:31) వాక్యమునుబట్టి యౌవనులు తమ నడతను శుద్ధ చేసుకొన గలరని (119:9), వాక్యము హృదయములో వున్నట్లయితే ఆయన యెదుట పాపము చేయమని (119:9) కీర్తనా కారుడు బోధించుచున్నాడు. అవును ఈ వాక్యములో జీవము న్నది. అది మనుష్యులకు వెలుగైయున్నది. అయితే క్రైస్తవేతరులే కాదు క్రైస్తవులు కూడా వాక్యమును అన్యమైనదిగా భావించే కేవలం సంఘకాపరులకు, వారి ప్రసంగములకు ఉపయోగ పడే ఒక టెక్స్ట్‌బుక్ అని అనుకుంటారు. ఈ వాక్యము ఇహ లోకములో వున్న మనకు బుద్ధి కలుగుటకు ఆత్మావేశము వలన వ్రాయబడిన ఈ మాటలను అన్యములుగా భావించుట ఎంతో దుఃఖకరమైన విషయం. హోషేయా (8:12) ప్రవక్త ద్వారా పలికిన ఈ మాటలు ఈ దినములలో కూడా యధార్థములే "నేను అతని కొరకు నా ధర్మశాస్త్రమును పరిపూర్ణముగా వ్రాయించి నియమించినను వాటిని అతడు అన్యములుగా ఎంచెను"

ఈ వాక్యమును ఎడతెగక ధ్యానించవలెననుటకు కొన్ని కారణములను తెలుసుకుందాం :

1. యోహాను 5:39 మూలభాషలో - లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని 'పరిశోధించుడి' అని వ్రాయబడియున్నది. ఆయన ఆజ్ఞయై యున్నది. లేఖన ములను ధ్యానించుట ఆయన ఆజ్ఞకు లోబడుట.

2. ఇదే వాక్యములో లేఖనములయందు జీవమున్నదని ధ్యానించుట ద్వారా మనకు నిత్యజీవము కలుగునని స్పష్ట మగుచున్నది.

3. వాక్యమును ధ్యానించడమనేది ఒక గొప్ప ధన్యత. కీర్తనలు 1:2,3 'యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రములు దానిని ధ్యానించువాడు ధన్యుడు'. వాక్యము ధ్యానించుట వలన ఫలవంతమైన జీవితము, ఇతరులకు ఆశీర్వాదకరమైన జీవితము కలుగును. 'అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును. అతడు చేయునదంతయు సఫలమగును'.

4. ప్రకటన 1:3 'సమయము సమీపించియున్నది గనుక ఈ ప్రవచన వాక్యములు చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులను గైకొనువారును ధన్యులు'. దేవునిచే ధన్యులు అని పిలువబడుదుము. ఆయన మన జీవితములను ఆశీర్వాదకరముగా చేయును.

5. మన ప్రార్థనలకు జవాబు ఇవ్వబడుతుంది. యోహాను 15:7 'మీయందు నా మాటలు నిలిచియున్నట్లయితే మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహించబడును'.

6. వాక్య ధ్యానము పాపమునకు దూరముగా ఉంచును. కీర్తన 119:1 'నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యమును ఉంచుకొనియున్నాను'.

7. వాక్యధ్యానము అధిక జ్ఞానము పుట్టించును. కీర్తన 119:98-100 'నా శత్రువులను మించిన జ్ఞానము అవి నాకు కలుగజేయుచున్నవి... నా బోధకులందరి కంటే నాకు విశేష జ్ఞానము గలదు'.

8. వాక్యధ్యానము తెలివిలేని వారికి తెలివి కలిగించును. కీర్తన 119:130 'నీ వాక్యము వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును. అది తెలివిలేని వారికి తెలివి కలిగించును'.

9. 2తిమోతి - 'దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యము నకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుట కును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది'.

10. హెబ్రీ.4:12 'దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మను కీళ్ళను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను

శోధించుచున్నది'.

11. ప్రభువు యొక్క మహాశక్తినిబట్టి ఆయనయందు బలవంతులైయుండుటకు, అపవాది అనగా సాతాను తంత్రములను ఎదిరించుటకు, ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను, ఆకాశ మండలమందున్న దురాత్మల సమూహములతో పోరా డుటకు, ఎదిరించుటకు, శక్తిమంతులమగునట్లు దేవుడు ఇచ్చు సర్వాంగ కవచములో దేవుని వాక్యము రెండంచులు గల ఆత్మ ఖడ్గము (ఎఫెసి. 6:10-17). ఈ వాక్య ధ్యానము ఆత్మీయ పోరాటములో ఎంతగానో ఉపయోగపడుతుంది. అపవాదికి యేసయ్యకు జరిగిన ఆత్మీయ పోరాటములో (మత్తయి 4:1-11, లూకా 4:1-13) అపవాది వాక్యమును ఉపయోగించగా యేసయ్య కూడా వాక్య ఖడ్గము ద్వారానే ఎదిరించి తరిమి వేయగలిగాడు. అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవును (యాకోబు 4:1-7).

12. పుష్టికరమైన ఆత్మీయ ఆహారము వాక్యధ్యానములో వస్తుంది. రక్షణ విషయంలో ఎదుగుదలకు వాక్యమను పాలు ఎంతైనా అవసరము. 1పేతురు 2:1-3 'క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయంలో ఎదుగు నిమిత్తం, ఆ పాలను అపేక్షించండి'.

ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ఇంకా అనేక దృఢమైన కారణాలు వుంటాయి. ఏది ఏమైనప్పటికీ దైవ వాక్యము మన అనుదిన ఆత్మీయ జీవితమునకు ఏంతైనా శక్తిననుగ్రహించి ఆత్మీయ జయ జీవితమునకు దోహదకరము.

ఈ నిత్యజీవజలమైన బైబిలును మనము తప్పక ధ్యానించవలెను. ఈ దేవుని వాక్యము ఎన్నో జీవిత సమస్యలకు జవాబునిస్తుంది మానవజాతికి నిజమైన ప్రేమగలిగిన స్నేహితుడైన యేసుక్రీస్తును పరిచయం చేస్తుంది. దానుని స్వరూపమును ధరించుకొని, దేవుడైయుండి తన్ను తాను రిక్తునిగా చేసుకొని సిలువ మరణము పొందునంతగా విధేయత చూపిన ఆయన, తన మూడున్నర సంవత్సరాల సేవాకాలంలో రాత్రనక పగలనక సువార్త ప్రకటించి కార్యసిద్ధితో 'నీ చిత్తమే జరుగును గాక' అని తన ప్రశస్త పరిశుద్ధ రక్తమును చిందించి శరీరమందు నలుగగొట్టబడి, మన ఆత్మలకు రక్షణ, శరీరమునకు స్వస్థత దయచేసి మరణ పునరుత్థానము దయచేసి ఆయన దేనికి శిల్పియు, నిర్మాణకుడునైయున్నాడో అట్టి పట్టణములో తండ్రితో సహా వసించు భాగ్యమును కలిగించిన ఆ యేసయ్య పూర్తి వృత్తాంతమును ఈ నిత్యజీవములో తెలుసుకుంటాం.

ఈ దినాలలో చాలామంది క్రైస్తవులు జీవగ్రంధమును జీవితంలో ఒకసారైనా తెరువని వారున్నారంటే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. బైబిలను చేతితో పట్టుకొని వీధిలో నడవడానికి సిగ్గుపడతారు. సంఘములో నోరు తెరచి పదిమందిలో చదవడానికి సిగ్గుపడతారు. చాలామంది క్రైస్తవులకు ఇందులో 66 పుస్తకములున్నవని తెలియదు. పుస్తకముల క్రమము తెలియక తికమత పడే అనేకమంది క్రైస్తవులనబడే స్నేహితులు నాకు తెలుసు. ఈ క్రమము తెలుసుకుంటేనే పరలోకరాజ్యములోనికి ప్రవేశిస్తాము అని నేను అనను. అయితే క్రైస్తవులమైన మనము ఏ పుస్తకము ఏమి చెపుతుండో తెలుసుకుంటే కష్ట సమయాలలో మనలను ఊరటపరచే ఆ వాక్యభాగములను మనం పఠించవచ్చు కదా! సాధారణ సంఘ సభ్యులు మాత్రమే కాదు సంఘ నాయకు లనబడే అనేకమంది ప్రసంగీకులు కూడా బైబిల్ ద్వారా మనకు వెచ్చించే సమయం చాలా తక్కువ. ఎందుకంటే అవిరామముగా దేవుని పని చేస్తున్నామంటారు. మనం దేవుని పేరట ఇతరులతో గడిపే సమయం కంటే దేవునితో ముఖాముఖిగా గడిపే సమయమే దేవునికి ఇష్టం. లాజరు సహోదరి మరియను 'ఉత్తమమైనది' కోరుకున్నదని యేసయ్య చెప్పటం మనం జ్ఞాపకం చేసుకోవచ్చు. ఈ లోకంలో జరిగే విషయాలు తెలుసుకోవాలని, వాటిని గురించి చదవాలని అనేకమంది దినపత్రికలు, వార పత్రికలు, నవలలకు ఎంతో ధనం, సమయం వెచ్చిస్తారు. అయితే బైబిల్ చదవడానికి?

క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితానికి బైబిలు పఠనం ఎంతో అవసరం. బైబిలును గురించి మహామేధావులు ఈ విధంగా వర్ణించారు 'బైబిలు దేవుడు మానవులకు ఇచ్చిన గొప్ప వరం. దేవుని ద్వారా వచ్చు ప్రతి ఆశీర్వాదము ఇందు పొందుపరచబడి ఉంది' -అబ్రాహాంలింకన్, 'బైబిల్ వట్టి పుస్తకం కాదు. అది జీవము, శక్తి కలిగి తన్ను వ్యతిరేకించు వారిని జయించగలిగిన గ్రంథం' -నెపోలియన్, 'చరిత్రలోనైనా అబద్ధం చోటు చేసుకోవచ్చు కాని బైబిల్ ఒక స్వచ్ఛమైన చరిత్రను చాటుతుంది' -సర్ ఐజక్‌న్యూటన్, 'దేవుడు, దేవుని వాక్యము లేకుండా ప్రజాపాలన చాలా కష్టతరం' -జార్జివాషింగ్టన్‌లు వర్ణించారు.

(సశేషం)

# శాశ్వత రక్షణ

## (రక్షణ యొక్క శాశ్వత భద్రత)

భావాలు మారినవి అని. రక్షణ అనే మాట గ్రీకు భాషలో 'నష్టపోకుండ కాపాడుట, అపాయము నుండి నాశనము నుండి భద్రపరచుట లేక 'స్వస్థత పొందుట' అనే అర్థాలను ఇస్తుంది (మార్కు 5:23, లూకా 8:36, అపో.కార్య. 27:20) కనుక సందర్భాన్నిబట్టి ఈ రక్షణ అనే మాటను వాడాలి. కొన్ని సందర్భాల్లో మాత్రమే ఈ రక్షణ అనే మాట నిత్య నాశనము నుంచి రక్షించి నిత్యజీవము ఇచ్చే రక్షణ విషయంలో వాడబడింది (అపో.16:31, ఎఫెసీ. 2:8). యాకోబులో మాత్రం ఈ రక్షణ అనే మాట వెయ్యేండ్ల పరిపాలనలో క్రీస్తు న్యాయపీఠం ఎదుట విశ్వాసులు పొందబోవు శిక్ష నుంచి తప్పించుట అనే అర్ధముగా వాడబడింది.

యాకోబు పత్రిక చెదరిపోయివున్న యూదుల రక్షణ కొరకు ప్రత్యేకంగా వ్రాయబడిందని గుర్తుంచుకోవాలి. అంటే మనకు వర్తించదా? అని ప్రశ్నిస్తారు. ఎందుకు వర్తించదు? వర్తిస్తుంది. కాని ఇక్కడ విషయమేమంటే యూదులు వెయ్యేండ్ల పరిపాలన కొరకే ఎదురు చూశారు. నిత్యజీవము కొరకు కాదు. కనుక యాకోబు వెయ్యేండ్ల పరిపాలన గురించి ఇక్కడ ప్రస్తావించాడు.

మంచి క్రియలు లేని క్రైస్తవులు (విశ్వాసులు) ఏ విధమైన తీర్పు పొందుతారో సోమరియైన చెడ్డ దాసునికి పోల్చి మత్త. 25:23-30లో చూపించారు. పౌలు తన విశ్వాస జీవితమును జయకరంగా ముగించినట్లు 2తిమో.4:7లో వ్రాస్తూ 'ప్రభువు ప్రతి దుష్కార్యము నుండి తనను రక్షించి పరలోక రాజ్యమునకు తను చేరునట్లు రక్షించునుగాక అని 2తిమో.4:18లో పూర్తి చేస్తాడు.

కనుక క్రొత్త నిబంధన ప్రకారము రెండు విధములైన సంగతులు విశ్వాసికి సంభవిస్తాయి.

**1) నిత్యజీవము** – ఉచితముగా (దానముగా) పొందేది : 'కాబట్టి నమ్మువాడు ఆయన కృపచేతనే, క్రీస్తునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులనుగా తీర్చబడుట' (రోమా 3:24). కాబట్టి మనము క్రియలనుబట్టి కాక మన విశ్వాసమునుబట్టియే మనలను దేవుడు తన మహాకృపలో నీతిమంతులుగా తీర్చుచున్నాడు (రోమా 3:26-28, 4:5,6). దేవునిచేత నీతిమంతులుగా తీర్చబడిన మనము ఎన్నటికి నిత్యజీవమును పోగొట్టుకొనము (రోమా 8:30-34). క్రీస్తులో మనకు నూతన జీవనము కలిగినది. నూతన స్థితిలో ప్రవేశించాము (యోహాను 5:24, రోమా 4:25, 5:18).

**2) పరలోకరాజ్యము** – ప్రతిఫలముగా పొందేది : ఇది క్రియల వలన పొందే ప్రతిఫలము. క్రీస్తు న్యాయపీఠము ఎదుట ఎవని క్రియలకు తగినట్లుగా పొందే తీర్పు (యాకోబు 2:21-24). మంచివిగాని చెడ్డవిగాని తగినట్లుగా ఫలము పొందుతాము (1కొరింథీ.3:12-14, 4:4,5, 2కొరింథీ.5:10, 1పేతు.1:1).

క్రియలనుబట్టి ఒకవేళ మనము మంచి బహుమానం పొందక పోవచ్చును (1కొరింథీ.2:27) మంచి బహుమానము పొందనూ వచ్చును (యాకోబు 1:12). విశ్వాసము ద్వారా నిత్యజీవము, క్రియల ద్వారా పరలోక రాజ్యములో ఫలములు పొందుతాము.

పరుగు పందెములో తాను గెలిచినట్లుగా బహుమానంగా జీవకిరీటమును పొందగలడని పౌలు భక్తునికి దేవుడు తన అవసాల కాలమందు తెలియజేశాడు (2తిమో.4:7,8). అయితే పౌలు నిత్యజీవ ప్రవేశానికి ఎప్పుడూ అనుమానము లేదు. ఇప్పుడు చనిపోతే ప్రభువుతో వుంటాను అన్నాడు. అంటే నిత్యజీవములో వుంటాడని అర్థం.

ఇప్పుడు పాఠకులందరికి ఉచితముగా పొందే **బహుమానము,** క్రియలకు తగినట్లుగా పొందే **ప్రతిఫలమును** గూర్చి అర్థమయింది. కనుక ఈ విషయాలు చదివేటప్పుడు ఎక్కడ ఏది అవసరమో దానిని అన్వయించుకోవాలి. పదాలు అన్వర్తించుకొనేటప్పుడు దేవుడు ప్రేమా స్వరూపి అని మాత్రం గుర్తుంచుకోండి. అంతమాత్రంచేత శిక్ష తప్పించుకోరు. శిక్ష భయంకరంగానే ఉంటుంది కాని శాశ్వతమైనది మాత్రం కాదు. తన కుమారునియందు జగత్తు పునాది వేయబడక ముందే మనలను శాశ్వత జీవము కొరకు నిర్ధారించిన ప్రేమగల దేవుడు మన అతిక్రమములనుబట్టి శిక్షిస్తాడుగాని మనలను పోగొట్టుకొనడు (సామె.19:18, కీర్త.89:30-34, ఎఫెసీ. 1:3-5, రోమా 8:29,39). ఈ వచన భాగాలలో ఏవీ మనం నిత్యజీవాన్ని పోగొట్టుకుంటామని తెలియజేయటం లేదు.

ఎందుకంటే నిత్యజీవము పొంకుండా చేసే ఆ నిత్య శిక్షను యేసు సిలువలో మన పక్షముగా భరించాడు. వెయ్యేండ్ల పరిపాలనలో ఉండే శిక్ష భయంకరంగానే ఉండవచ్చునుగాని శాశ్వతం కాదు (1కొరింథీ.5:1-5, 11:29-32, లూకా 12:41-45). ఎందుకంటే వెయ్యేండ్ల పరిపాలనే శాశ్వతమైనది కాదు.

నిత్యజీవములో మరణమైనను, దుఃఖమైనను, వేదనయైనను ఇక వుండదు. మొదటి సంగతులు గతించెను (ప్రక. 21:4). మొదటి సంగతులు అంటే మొదట సంభవించేవి. వెయ్యేండ్ల పరిపాలన అయిపోయిందని అర్థము.

ఇప్పుడు సంభవించేవి అంటే నిత్యజీవములో సంభవించేవి. ఆశ్చర్యకరమైన ప్రేమ యొక్క దయ, కృపామయమైన సంగతులు క్రీస్తు స్వరూపములోనికి రూపాంతరము పొందుటకు అవసరమైన శిక్షణ కార్యక్రమ పనులు పూర్తి అయినవి. ఇక శాపము లేదు. ఆయన పేరు మన నొసటి మీద ముద్రింపబడి వుంటుంది. ఆయన వెలుగులో ఆయనను సేవిస్తూ యుగయుగములు ఆయనతో పరిపాలిస్తూ వుంటాము. దేవునికి స్తోత్రము హల్లెలూయ! (ప్రక. 22:3-5).

ఒక గొప్ప వ్యాపారైన తండ్రి తన బిడ్డలు తన తరువాత తన కార్యక్రమాలు స్వీకరించటానికి వారికి ఏ విధమైన తర్ఫీదు ఇస్తాడో ఆ తరువాత వారికి తన పని అప్పజెప్పడానికి వారి పరిపూర్ణతకు ఏ విధంగా కనిపెట్టి వుంటాడో ఆ విధంగానే మన పరలోకపు తండ్రి మనకు క్రీస్తుయేసు మూలరాయిగా తర్ఫీదును ఇచ్చి క్రీస్తుయేసుకు సమానమైన పరిపూర్ణతకు మనలను తీసుకొని వచ్చి సృష్టి కార్యమును మనకు అప్పజెప్పుటకు వేచియున్నాడు.

కనుక మనము పొందబోవు భాగ్యము ముందు ఇప్పటి కాలపు మన శిక్షణకు సంబంధించిన శ్రమ అల్పమైనది (రోమా 8:18-23). కనుక మన ముందున్న పందెములో ఓపికగా పరుగెత్తుదము (హెబ్రీ. 12:1).

ప్రేమా స్వరూపియైన దేవుడు ఈ పుస్తకమును చదువుతున్న ప్రతి ఒక్కరికి తన అమూల్య శాశ్వత సంకల్పము అర్థమగునట్లు సహాయపడునుగాక! ఈ గొప్ప రక్షణలో మనమందరము ప్రేమా స్వరూపియైన మన తండ్రిని సంతోషపరచు విధంగా నడుచుకొందుము గాక!

---

రెండవ భాగము

## హెబ్రీ పత్రిక యొక్క ఉపోద్ఘాతము మరియు 6వ అధ్యాయము యొక్క వివరణ

ప్రియ సహోదరి సహోదరులారా! నా మనసులో వున్న ఒక ఆలోచనను మీ ముందుంచాలని పరిశుద్ధాత్మ దేవుడు నాకిచ్చిన తలంపే మీ చేతుల్లో వున్న ఈ పుస్తకం. మనం హెబ్రీ పత్రికలో 6,10 అధ్యాయాలు చదువుతున్నప్పుడు ఇందులోనున్న కొన్ని వచనములు విశ్వాసులు ఒకసారి తప్పిపోతే వారు మరలా రక్షింపబడుటకు ఆస్కారము లేనట్లుగా కనబడుతుంది. ఇది చాలామంది విశ్వాసులను నిరుత్సాహపరచే విషయం. అలా ఎన్నటికీ కాదు. అసలు పౌలుగారు వ్రాసిన సందర్భమే వేరు. ఈ విషయం విశ్వాసులకు తేటగా వివరించడానికే ఈ పుస్తకం వ్రాయబడింది. నిష్పక్షపాతంగా, ప్రార్థనాపూర్వకంగా దీనిని చదివి ఆలోచించవలసినదిగా మనవి.

బైబిలులో వ్రాయబడినవన్నీ పరిశుద్ధాత్మచేత ప్రేరేపింపబడి వ్రాయబడినవి. కనుక ప్రకృతి సంబంధమైన మనుష్యుడు ఈ (ఆత్మ సంబంధమైన) విషయములు గ్రహింపలేడు (1కొరింథీ. 2:14). ఎంత భక్తుడైనప్పటికీ, నిష్టాగరిష్టుడు అయినప్పటికీ లోకసంబంధమైన జ్ఞానం ఎంత ఉన్నప్పటికీ దేవుని యొక్క వాక్యంలోని మర్మములు గ్రహించలేరు. తన స్వబుద్ధిని ఆధారం చేసుకొనక వినయమైన మనస్సుతో పరిశుద్ధాత్మ దేవుడు అనుగ్రహించు జ్ఞానముతో దేవుని సన్నిధిలో ధ్యానించిప్పుడు మాత్రమే ఆత్మను రక్షించుటకు శక్తిగల వాక్యములోని మర్మములు మనకు బయలుపరచబడును (యాకోబు 1:21).

బైబిలులోని వాక్యములను, బైబిలులోని ఇతర గ్రంథములలో వ్రాయబడిన వాక్యములతో సరిచూసుకుంటూ అర్థం చేసుకోవాలి కాని మనుష్య జ్ఞానమునుబట్టిగాని ఇచ్ఛనుబట్టిగాని, లేఖనములు వ్రాయబడలేదు. పరిశుద్ధాత్మ మూలంగా ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా కల్గినవి. (2తిమో. 3:16, 2పేతు. 1:20,21) ప్రవచనము అనగా భవిష్యత్తుని తెల్పునది మాత్రమే కాదు అందరూ హెచ్చరిక పొందునట్లును నేర్చుకొనునట్లును చెప్పబడు దైవ వాక్యము. హెబ్రీ పత్రిక, యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఆయా సమయములలో, నానా విధములుగా ప్రవక్తల ద్వారా మాట్లాడిన దేవుడు, ఈ అంత్య దినములలో తాను మానవులతో మాట్లాడినట్లు మొదలవుతుంది.

సీరియల్

# మహా యజ్ఞమ్

12

లేఖనముల ప్రకారం, ఆ దేవుని గొఱ్ఱెపిల్ల ముందుగానే అర్పింపబడినాడు. ప్రస్తుతం మనం మహాయజ్ఞ ఫలాలను కనుగొనాలి. అందునిమిత్తమై యేసును అనుసరిస్తూ ఆయన మన అందరిని ప్రేమించి తనను తానే మనకు సమర్పించుకున్న రీతి, మనం కూడ ఒకరినొకరం ప్రేమించు కుంటూ, సమర్పణతో జీవించాలి. "క్రీస్తు మిమ్మును ప్రేమించి పరిమళ వాసనగా ఉండుటకు మన కొరకు తనను తాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించు కొనెను. ఆలాగుననే మీరును ప్రేమ కలిగి నడుచుకొనుడి' (ఎఫెసీ. 5:2) మంచినే చేయుట దానిని ఇతరులతో పంచు కొనుట, దేవుని ఆరాధించుట నూతన నిబంధనకాలంలో, సమర్పణా చర్యను, కొనసాగిస్తూ వుంటాయి. ఈ సందర్భాన్ని హెబ్రీ 13:15,16లో చూస్తే "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడూ స్తుతియాగము చేయుదము. అనగా ఆయన నామమును ఒప్పుకొనుచూ, జిహ్వా ఫలము అర్పించుదము. ఉపకారమును ధర్మమును చేయ మరచి పోకుడి. అట్టి యాగములు దేవునికి ఇష్టమైనవి" అని తెలుస్తుంది.

వస్తు సంపదను ఇతరుల ప్రయోజనార్ధం పంచినట్ల యితే ప్రభువు యొక్క క్రియ సజీవయాగముగా మారుతుంది. మనం అర్పించే ప్రతి కానుక పవిత్రమైనదిగను, దేవునికి అంగీకారమైనదిగను ఉండాలి. అపవిత్రంగా ఆర్జించి అర్పింపబడిన వాటిని దేవుడు అంగీకరించడు. పాపుల నుండి దేవుడెలాటి ద్రవ్యమునుగాని, వస్తువులనుగాని అర్పణగా గైకొనడు. కాబట్టి మనిషి మొదటిగా దేవుని యొక్క పరిపూర్ణమైన యాగము వలన అతడు పూర్తిగా మన్నింపబడి నాడనే నమ్మికకు రావాలి. పురుష సమర్పణా యాగాన్ని గుర్తించినపుడే మనం నూతన సృష్టికాగలం. నూతనముగ ప్రభువు యేసునందు సృష్టింపబడిన ప్రజలు ఆధ్యాత్మిక సజీవ యాగములుగ అభిషేకింపబడి అనుదినం సత్క్రియలను చేస్తూ ఇతరులకు వాటిని పంచిపెడుతూ ఉంటారు. మన ప్రభువు రక్షకుడైన యేసుక్రీస్తు యెడల ప్రశస్తమైన ప్రేమతో, మనకున్న దేనినైనా ఇతరులతో పంచుకోవాలి. అటువంటి వారి హృదయాల్లో నుండి నిజమైన ఆరాధన సంకీర్తన జనిస్తాయి.

### ముండ్లకిరీటం

ఋగ్వేద పురుష సూక్త ప్రకారం పూర్తిగ ఒక మనిషి నైవేద్యం నిమిత్తం ప్రత్యేకింపబడుతాడు. ఒక ఐదునాళ్ళ మేరకు నిజమైన నరమేధమును గూర్చి శత పథ బ్రాహ్మణం తెలుపుతోంది. పురుషమేధం, నరమేధం రెండూ ఒకటే. వ్యావహారిక పదజాలంలో 'నరబలి' అంటాం. నరబలి అంటే కనబడిన మనిషిని పట్టుకొని నరబలి ఇచ్చే నైవేద్యంగా చేయడం కాదు. పురుష మేధమునకు తగిన లక్షణాలున్న మనిషి ప్రత్యేకింపబడతాడు. ఒక మనిషిని సిద్ధపరచి పురుష మేధం మధ్య దినానికి ప్రత్యేకించి, ఉంచుతారని వ్రాయబడి వుంది.

అశ్వమేధంలో ఒక అశ్వాన్ని ఎన్నుకొని బంధించి, స్నానం చేయించి, అగ్నిహోత్రం ఎదుట నిలువబెట్టి, యజ్ఞంకోసం ప్రత్యేకిస్తారు. ఈ విషయం కూడా శతపథ బ్రాహ్మణంలో వుంది. కొన్ని పర్యాయాలు, బలి పశువును అడవి తీగల కిరీటంతో అలంకరించి ప్రత్యేకిస్తారు. ప్రత్యేకింపబడిన ఈ బలి పశువుపై ఎలాంటి జాలి వుండదు. దానిని మరి ఏ ఇతర పనికి కూడ ఉపయోగించరు. ఒక పర్యాయం అది ప్రత్యేకింపబడినట్లయితే అది అర్పణ కొరకే ప్రత్యేకింపబడి వుంటుంది. ఈ ధర్మం యేసుక్రీస్తు మహాయజ్ఞంలో కూడా నెరవేర్చబడింది. యేసుక్రీస్తు తన శాశ్వత మహా యజ్ఞం విషయంలో సంపూర్తిగా ప్రత్యేకింపబడినాడు. పరిశుద్ధ యోహాను తెలిపిన విషయం చూస్తే 'సైనికులు ముండ్లతో కిరీటమును అల్లి ఆయన తలమీద పెట్టిరి' – ఆ ముండ్ల కిరీటమును, ఊదారంగు వస్త్రమును, ధరించి యేసు వెలుపలికి రాగా, పిలాతు – 'ఇదిగో ఈ మనుష్యుడు (పురుష) అంటే 'ప్రజాపతి పురుషశ్రీ, యేసుక్రీస్తే' అని వారితో ప్రస్తావించాడు' (యోహాను 19:2,5) ఆహా ఎంత భావ గర్భితమైన ప్రస్తావనో ఇది – పిలాతు ఒక ఆధ్యాత్మిక వ్యక్తి కాదు. సత్య పరిశోధనకు, ఆయనకు సంబంధం లేదు. కాని పురుషశ్రీ యేసును చూస్తూ వేదాలలోని ప్రవచనాలు

తెలిసిన వానివలె అతడు 'ఇదిగో ఆ మనుష్యుడు ఇతడే పురుషశ్రీ యేసుక్రీస్తు' అని నొక్కి వక్కాణించాడు.

కైఫా, అతడు నిజమైన దైవ సేవకుడు కాకపోయినా పరుల కొరకు యేసు ప్రాణం అర్పిస్తాడని ప్రవచించాడు. అదే విధంగా ప్రజాపతి యేసుక్రీస్తు, మహాయజ్ఞ లక్షణాలను దేవుడు, పిలాతు నోటివెంట పలికించాడు. దేవుని యొక్క పరిపూర్ణమైన మహాయజ్ఞంగా పురుషశ్రీ యేసు, అర్పణకు సిద్ధంగా ఉన్నట్లు పిలాతు, సకల లోకానికి ప్రకటించాడు. అంతేకాదు, 'ప్రధానయాజకులు, ఇతర అధికారులు యేసును చూడగానే 'సిలువ వేయండి, సిలువ వేయండి' అని కేకలు వేశారు. మరో విధంగా తెలిపితే సిలువ వేయండి, సిలువ వేయండి అంటే అతడే వాస్తవమైన బల్యర్పణ అని భావం.

ఆయన మహాయజ్ఞం కోసం ప్రత్యేకింపబడినాడని అంతకు ముందే తెలుసునని బైబిల్ గ్రంథం వెల్లడిస్తుంది. అయితే ముండ్ల కిరీటాన్ని ధరించి, ప్రత్యేకింపబడు ఈ ముఖ్యాంశానికి సంబంధించిన ఫలితం ఏమిటి? లోకస్థులైన వారు ఒక్కొక్క విశ్వాసికి ఒక కిరీటం చొప్పున ఇచ్చి ఏకాంత పరుస్తారు. వారు ఆయనను అవమానపరుస్తూ హింసిస్తూ ఉంటారు. అందుకే యేసు విశ్వాసులను హెచ్చరిస్తున్నాడు, 'నా నామము నిమిత్తము సకల జనములచేత మీరు ద్వేషింప బడుదురు' అని, అంతేకాదు, నేను మిమ్మును ఏర్పరచు కున్నందున లోకము మిమ్మును ద్వేషిస్తుంది. వారు నన్ను హింసిస్తే మిమ్మును కూడా హింసిస్తారు. ఈ లోకం మీకు ముండ్ల కిరీటం ఇవ్వడం ప్రారంభిస్తే, మీరు సజీవయాగం నిమిత్తం పూర్తిగా ప్రత్యేకింపబడినారని గ్రహించాలి. మీరు ఆ కార్యము నిమిత్తం ఏర్పరచబడినారు. గనుక మీకేవిధమైన జాలి లభించదని తెలుసుకోవాలి.

ఒక విశ్వాసి ముండ్ల కిరీటాన్ని ధరించుకోవడం మహా గొప్ప అవకాశం. అతడు మహాయజ్ఞ నైవేద్యంగా గుర్తింప బడతాడు. ఒక ఉత్తమ విశ్వాసి లోకసంపదలకంటే క్రీస్తు సిలువయే మహా గొప్పదని పరిగ్రహిస్తాడు.

## పరిశుద్ధ పౌలు సాక్ష్యము గమనిద్దాం

'నిన్నుబట్టి దినమెల్ల మేము వధింపబడిన వారమైతిమి. వధకు తేబడిన గొఱ్ఱెలముగా ఎంచబడితిమి' (రోమా 8:36).

'అనేక పర్యాయాలు చెరసాలలో ఉంటిని. అపరిమిత ముగా దెబ్బలు తింటిని, అనేక మారులు ప్రాణాపాయము లలో ఉంటిని' (2కొరిం.11:23).

'క్రీస్తు నిమిత్తము నాకు కలిగిన బలహీనతలలోను, నిందలలోను, ఇబ్బందులలోను, ఉపద్రవములలోను నేను సంతోషించుచున్నాను' (2కొరిం.12:10). 1పేతు.4:13,14 వాక్యాలు చూస్తే, 'క్రీస్తు మహిమ బయలుపరచబడినప్పుడు మీరు మహానందంతో సంతోషించు నిమిత్తము, క్రీస్తు శ్రమలలో మీరు పాలివారై ఉన్నంతగా సంతోషించుడి. క్రీస్తు నామము నిమిత్తము, క్రీస్తు నామము నిమిత్తము మీరు, నిందలపాలైన యెడల మహిమా స్వరూపి అయిన ఆత్మ, అనగా దేవుని ఆత్మ మీమీద నిలుచుచున్నాడు. గనుక మీరు ధన్యులు' అని తెలుస్తుంది. ఈ విధంగా అనేక సంఘటనల ద్వారా విశ్వాసులమైన మనం, సజీవ యాగఫలాన్ని సమ గ్రంగా పొందగలమని కొనసాగుదాం.

సజీవయాగ చతుర్థాంశంగా మనలను మనం మంచి కార్యాలకై ప్రత్యేకించుకుందాం. మన క్రొత్త నిబంధన పరమైన పరిత్యాగాలను ఆరాధనా విధానాన్ని ఒకరితో ఒకరం పంచుకుంటూ పయనిద్దాం. మనం ఇతరులకు మంచి చేసేందుకై ప్రత్యేకింపబడి అభిషేకింపబడినాము. గనుక మరో మార్గం మనకు లేదు. మన భౌతిక ఆశీర్వా దాలను పంచివ్వడానికి పరిత్యాగం చేయడానికి తీర్మానించు కున్నాం. కాబట్టి మొట్టమొదటిగా మనము ఆ భాగాన్ని మనఃపూర్వకంగా ప్రత్యేకించి ఉంచాలి. అలా ప్రత్యేకించిన భాగాన్ని తిరిగి తీసుకోకూడదు. దాన్ని త్యజించాలి, అర్పించాలి ఫలితాను పిదప చూడగలం.

## పురుషమేధం గురించి ఋగ్వేద సాక్ష్యం

దేవతలు యజ్ఞం చేయునపుడు జీవుని, యాగ పశువుగా నియమించుకొనేవారు. ప్రాణపంచకం పేరుతో భూతపంచకం, తన్మాత్ర పంచకం, జ్ఞానేంద్రియ పంచకం, కర్మేంద్రియ పంచకంతో పాటు, పంచభూతాలు సాధనాలుగా ప్రవర్తించేవి. ఆ యజ్ఞనమునకు ఆరంభమున పుట్టిన జీవుని యజ్ఞంలో సంస్కరించేవారు. జ్ఞానులు, ఋషులు, బుధులు ఆ జీవిని పూజించేవారు. తమ తమ దేహములో ఉన్న జీవాత్మను సమర్పించి, భగవంతుని పూజించిరి. ఋగ్వేదం లోని శునశ్శేపుని సూక్తులతో పాటు ఐతరేయ బ్రాహ్మణం లోను, కృష్ణయర్వేద బ్రాహ్మణంలోను, శుక్లయజుర్వేదమునకు సంబంధించిన ఖిల్లాల్లోను శతపథ బ్రాహ్మణాంత్య భాగంలోను నరమేధ యాగం సూచింపబడింది.

# అత్యంత ప్రియమైన అమ్మ

## (దేవుని బలిష్టమైన చేతిలో దీనపాత్ర కీ.శే. శ్రీమతి వై.యస్. జయమ్మ)

స్థానిక సంఘములో అనేకమందికి ఆమె ప్రోత్సాహకరంగా ఉండెడిది. స్థానికంగా సి.యస్.ఐ. సంఘమునకు చెందినప్పటికిని ఏ సంఘములోనైనా ప్రత్యేక కూడికలుగాని, గృహకూడికలుగాని వుంటే తప్పక హాజరయ్యేడివారు. సంఘ కార్యక్రమములకు తనతో పాటు ఇతరులను కూడ సిద్ధపరచి తీసుకొని వెళ్ళెడి అలవాటు గలవారు. ఏ కార్యక్రమమునకైనా సకాలంలో హాజరై, దైవభక్తితో వాక్యం విని, అందరిని పలకరించి వెళ్ళేడివారు. ఆమె అచంచల విశ్వాసము వలన అనేక శ్రమలు, ఇబ్బందుల నుండి ఆమె తప్పింపబడ్డారు. ప్రభువు ఆమె కుటుంబాన్ని భద్రపరచి, ఆమె కుమారులను అనేక భయంకర ప్రమాదాల నుండి కాపాడారు.

ఒకరోజు నేను కళాశాల నుండి ఇంటికి వెళ్తూ వుండగా శ్రీమతి జయమ్మగారు, పులివెందుల ఎం.ఆర్.ఒ. కార్యాలయం ఎదురుగా నిరాహార దీక్షలోవున్న మహిళలకు బైబిలు పట్టుకొని వాక్యాన్ని ప్రకటిస్తూ కనిపించారు. ఆ సన్నివేశాన్ని చూచిన నేను అడుగు ముందుకు వేయలేక పోయాను. నన్ను ఎంతగానో కదిలించివేసిన మరువలేని సన్నివేశము అది. ఎందుకంటే ఎంతోమంది వారికి మద్దతు ప్రకటించవచ్చు. జాలి చూపించవచ్చునేమో గాని ఆమె అయితే క్రీస్తుయేసే సమస్త సమస్యలకు జవాబు అని ధైర్యంగా ప్రకటించారు.

యు.ఇ.ఎస్.ఐ. పరిచర్యలో భాగంగా శిష్యత్వపు శిక్షణా శిబిరం, శ్రీ వై.యస్. వెంకటరెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాలలో జరుపుకొనుటకు అనుమతినిచ్చారు. ఆ కాలేజి ప్రిన్స్‌పాల్‌గారైన శ్రీమతి ఎస్. కమలమ్మగారు ఊర్లో లేరు. ఒకరోజు రాత్రి భోజనము సిద్ధము చేయుచుండగా మధ్యలో వంటగ్యాస్ అయిపోయింది. విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. అప్పుడు భారివర్షం కురుస్తూ వుంది. దిక్కుతోచని స్థితిలో శ్రీమతి జయమ్మగారికి ఫోను ద్వారా మా అవసరతను గురించి తెలియజేయగా వెంటనే ఆమె స్వయంగా గ్యాస్ సిలిండర్ తన కారులో వేసుకొని వచ్చారు. ఇలా అవసరతలో వున్న వారికి తగిన రీతిలో స్పందించి సహాయపడిన దానగుణశీలి. ఇందులో విశేషమేమంటే ఆ దినాలలో పులివెందులలో గ్యాస్ డీలర్లు లేరు. కడప నుండి మాత్రమే గ్యాస్ సిలిండరు తెచ్చుకొనేవారు. తమ పిల్లల క్షేమము కంటే దేవుని పిల్లల క్షేమము ముఖ్యమని తలంచిన వ్యక్తి. త్యాగమనేది దేవుని నుండి పొందుకునే సుగుణం. స్వార్థమనేది దేవునికి విరోధమైనది.

పరిశుద్ధ గ్రంథములో దైవజనుడైన మోషేను ఇశ్రాయేలీయులకు నాయకునిగా ప్రతిష్ఠించడానికి తన తల్లియైన యోకెబెదు పాత్ర చాల గొప్పది. అలాగే మన రాష్ట్రానికి గొప్ప నాయకులైన డా॥ వై.యస్.రాజశేఖర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రి స్థాయి చేరుటకు, శ్రీ వై.యస్. వివేకానందరెడ్డి గారు కడప పార్లమెంటు సభ్యుని స్థాయి చేరుటకు ఆమె ప్రోత్సాహం, ప్రార్థన ప్రధాన కారణం. ప్రజలకు ఏమైనా మేలు చేయండి అని తన కుమారులతో పదే పదే చెప్పు చుండేవారు.

అమెరికా దేశపు ప్రథమ అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ గారు "విధేయత" అనేది మా తల్లి చిన్ననాటి నుండి నేర్పింది అన్నాడు. అందుకేనేమో శ్రీమతి జయమ్మగారి సంతానం ఐదుగురు కుమారులుగాని, ఏకైక కుమార్తెనుగాని గమనిస్తే వారిలో తగ్గింపు స్వభావం బయలుపడుతుంది. వాక్యములో వున్నట్లు తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును, తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును. మన గౌరవ ముఖ్యమంత్రి డా॥ వై.యస్. రాజశేఖర్‌రెడ్డిగారు దైవభయము కలిగిన క్రైస్తవ నాయకుడు. దేవుణ్ణి, దేవునిగా ఘనపరచే వ్యక్తి. తన దైనందిన కార్యక్రమాలను ప్రార్థనతో ప్రారంభించి, ప్రార్థనతో ముగించే అలవాటు కలిగిన ప్రార్థనాపరుడు. అన్నిటిలో దేవునికి ప్రథమ స్థానమునిచ్చి దేవుని నామమును బహుగా హెచ్చించినవారు. ఎందుకంటే ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత మొట్టమొదటి నూతన సంవత్సరమును జరుపుకొనుటకుగాను 2005 జనవరి 1వ తేదీ

ఉదయముననే అనేకమంది అధికారులు, మంత్రులు శుభా కాంక్షలు తెలియజేయుటకు వచ్చినప్పటికినీ మొదట దేవుని సన్నిధిలో కుటుంబంతో ప్రార్ధనలో గడిపిన తరువాతనే మిగతా కార్యక్రమములకు వెళ్ళారు.

డా॥ వై.యస్.రాజశేఖర్‌రెడ్డిగారు తన రాజకీయ జీవితంలో ఎప్పుడు కూడా క్రైస్తవ దేవాలయాల్లో ప్రవేశించి ఓటు వేయమని అడుగలేదు. అంటే దేవుని పరిశుద్ధతను, ఘనతను, ఆయన సన్నిధిని గౌరవించే స్వభావము గలవారు. 'మదర్స్‌డే' సందర్భంగా విలేఖరుల సమావేశంలో మాట్లా డుతూ ఆయన విజయానికి కారణం కేవలం తన స్వయం కృషి కాదు గానీ తన తల్లి శ్రీమతి జయమ్మగారి ప్రార్ధన, తన సతీమణి విజయమ్మగారి మద్దతు, తన కుమార్తె షర్మిళమ్మగారి ప్రోత్సాహం అని అన్నారు. అంటే తన జీవితమును తీర్చిదిద్దుటలో తన తల్లిగారి పాత్ర ఎంత ప్రాముఖ్యమైనదో అర్ధం అవుతుంది. జన్మను యివ్వడమేగాక జీవితమును తీర్చిదిద్దిన తల్లిగారు ఆమె.

నాకున్న అనేక సంవత్సరాల అనుబంధంలో నేను ఎప్పుడూ కూడా విగ్రహారాధననుగాని, లోకాచారములుగాని ఆమె ఇంటిలో చూడలేదు. నీతిమంతులు పిల్లల పిల్లలను చూచెదరనెడి వాక్య ప్రకారం శ్రీమతి వై.యస్. జయమ్మగారు నాలుగు తరాల వ్యక్తులను తన కుటుంబంలో చూశారు. అలాంటి నీతిమంతురాలు దేవుని పిలుపునందుకొని 25-01-2006న ఆయన సన్నిధికి చేరారు. ఆమె భూస్థాపన కార్యక్రమము ద్వారా కూడ దేవుడు ఎంతగానో మహిమపరచబడినాడు. ఎంతోమంది నాయకులు, అధికా రులు మరియు ప్రజలు దేవుని వాక్యమును విని ఆత్మీయ మేలు పొందారు. అలాంటి నీతిమంతురాలును, యేసు ప్రభువు తన మహిమతో వచ్చునప్పుడు మనమందరము మధ్యాకాశములో కలుసుకుంటామనే శుభప్రదమైన నిరీక్షణతో ఆమె చూపించిన బాటలో జీవించి అనేకమందిని ప్రభువు చెంతకు నడిపించుదాం. (సమాప్తం)

**కుమార్తె శ్రీమతి బి. విమలారెడ్డి**

---

(19వ పేజీ తరువాయి...)

మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదము' ఆది.1:26. మన, మనము అన్న మాటలు బహువచన పదాలు. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు. ఆ తరువాత 'కర్ణపిశాచి' పతనమైన తన స్వరూపంలోకి మనుష్యుని మార్చడానికి ప్రయత్నిస్తాడు.

4. పరిశుద్ధాత్మ తన ఆత్మను నరునిలో ఉంచాడు : మన మందరం శరీరము, ఆత్మ అను రెండు భాగాలుగా చేయ బడ్డాము. 'దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను' ఆది.2:7. ఆ వెంటనే 'కర్ణపిశాచి' అసూయతో నరుని ఆత్మను తన స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నిస్తాడు. ఇప్పటికే పోరాటం సాగుతూ వుంది.

5. మనుష్యుడు ఇప్పుడు పాపం చేస్తున్నాడు. మరి పరిశుద్ధాత్మ మనుష్యుని విడిచిపెట్టాలి. ఎందుకు? ఎందుకంటే ఇప్పుడు మనుష్యుడు సాతానువలె దేవుని ఉగ్రతకు లోనైయున్నాడు. దీని గురించి యోహాను 3:36, రోమా 1:18 స్పష్టంగా చెప్తున్నాయి. సాతాను పతనమైనప్పుడు దేవుని సన్నిధి నుండి తొలగించబడ్డాడు. అలాగే ఇప్పుడు మనుష్యుడు కూడా దేవుని సన్నిధి నుండి తొలగించబడ్డాడు. వేదాంతానుసారంగా దేవుడే మనుష్యుని విడిచిపెట్టాడు అని చెప్పడం ఎంతో సరియైనది. మనుష్యుడు ఇంకెంత మాత్రం పవిత్రుడు కాదు. కాబట్టి దేవుని నిజ పరిశుద్ధాత్మ అతన్ని విడిచాడు!

ఏదేను తోటలో మనుష్యుని పతనానికి సంబంధించిన కథ యిదే. ఆదికాండము 2,3 అధ్యాయాలు చూచి దేవుని నుండి, మనుష్యుని ఎడబాటును గురించి అధికంగా తెలుసుకోండి.

అప్పటి నుండి మనమందరం రోమా 5:12 చెప్పినట్టు ఆదాము పిల్లలంగా పుట్టాము. యోహాను 12:31లో వివరించిన ప్రకారం సాతానును, పతనమైన ఈ లోకాధి కారిగా పిలుస్తారు. ఆదికాండము 3:15లో, మనందరికీ శారీరకంగా తండ్రి అయిన ఆదాముతో మనమూ పతనమై నందున, వెంటనే మనకు కూడా ఒక వాగ్దానం యియ్య బడింది. ఒకరోజున యేసు సాతాను శిరస్సు చితకగొడ తాడు. ఇప్పుడు మనం సుమారు ఐదువేల సంవత్సరాలు ముందుకు జరిగి ఆ వాగ్దానం ఎలా నెరవేరిందో చూద్దాం. (బైబిలు ఉపదేశిని పొందగోరువారు : ప్లాట్ నెం.1, ముత్తు మారియమ్మన్ కోయిల్ వీధి, మాధవరం, చెన్నై-60)

# మదర్ తెరీసా

1955వ సం॥లో లోయర్ సర్క్యులర్ రోడ్డులో మదర్ హౌస్ సమీపంలో ఒక పెద్ద రెండంతస్తుల భవనం అద్దెకు ఉన్నదని చెప్పినప్పుడు మదర్ తెరీసా వెళ్ళి చూశారు. ఇంత గొప్ప భవనంలో ఎన్నో గొప్ప కార్యాలను చేయడానికి వీలున్నది. చంటిబిడ్డలు, చిన్నపిల్లల కొరకు "నిర్మల శిశు భవన్" నెలకొల్పడానికి ఈ భవనం చాలా అనువుగా ఉంటుంది. ఇంకను పేదవారికి చేయనైయున్న కార్యక్రమాలకు కూడా ఉపయోగపడుతుంది. వెంటనే బెంగాల్ ముఖ్యమంత్రిగారిని కలవడానికి రైటర్ బంగళాకు వెళ్ళారు. డా॥బి.సి. రాయ్‌గారిని కలవడానికి నేరుగా అనుమతించారు. ఆయన తన పని ప్రక్కనపెట్టి మీరు టీ తీసుకుంటారా మదర్ అని అడిగాడు. మా సంస్థ నియమావళి ప్రకారము మదర్ హౌస్ బయట ఏ విధమైన ఆహార పానీయాలు తీసుకోము. ఎందుకంటే ఎంతోమంది నిరుపేదలను దర్శించినపుడు వారి దగ్గర ఏమీ లేకున్నా మాకు పెట్టాలని కష్టపడితే మా మనసు బాధగా ఉంటుంది. వారి దగ్గర అంగీకరించకుండా ఉన్నవారి దగ్గర తీసుకుంటే వ్యత్యాసపరచిన వారిమవుతాము. అందుకే మా నియమావళిలో ఈ అంశాన్ని చేర్చాము. గవర్నమెంటు నుండి కొంత ఆహారపదార్థాలు, మందులు సహాయం చేస్తే అవసరమైన వారికి ఉపయోగిస్తామని మదర్ అభ్యర్థించారు. వాటి విషయమై తప్పక ఆలోచించి చేస్తామని ముఖ్యమంత్రి గారు హామీ ఇచ్చారు. అప్పుడు మదర్ తను వచ్చిన ముఖ్యమైన పని చంటిబిడ్డల విషయమై ప్రస్తావించారు. డా॥బి.సి.రాయ్ చాలాశ్రద్ధతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ బిడ్డలు ఎలా ఉన్నారు? మెడికల్‌గా వారికి ఏ విధమైన చికిత్స చేస్తారు? ఎందరు బ్రతికారు? ఎక్కడ నుండి వారిని తీసుకుంటారు? వారి తల్లులు ఎవరు? ఏ బస్తీలలో సమస్య తీవ్రంగా ఉంది? మదర్ తెరీసా ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రిగారికి వివరించి, మేము ఎక్కువ విషయాలలో పట్టించుకుంటు ఎక్కువ చేస్తున్నామని మీరు అనుకుంటున్నారా అని అడిగారు. అలాగేమీ కాదు మదర్, ఇంకా ఎక్కువగా, గొప్పగా చేయండి. ఇలాంటి గొప్ప పనులకు డబ్బు లేకుండా కుంటుపడకూడదని అన్నారు. ఆమెకున్న విశ్వాసమే డా॥ రాయ్‌గారికి ఉన్నట్లు మదర్ అనుకున్నారు. నెలకు అయిదువేల రూపాయలకు ఆ భవనాన్ని అద్దెకు తీసుకునేందుకు గవర్నమెంటు వారు మంజూరు చేశారు. ఆమె ఆలోచించి ప్రతి పనికి డబ్బు ఎక్కువగా రావడం మొదలయింది. అవసరాలకు మించి డబ్బు విరాళంగా వస్తుంది. ఆ భవనంలో అనాథ బిడ్డలను ఉంచి, అక్కడ నుండే మందులు, ఆహారము పేదలకు పంచడానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. ఉదయాన్నే పేదవారు నిర్మల్ శిశుభవన్ ముందు నిలబడి మందుల కొరకు, ఆహారం కొరకు ఎదురు చూస్తుండే వారు.

నెలలు తక్కువ పిల్లలు, గర్భస్రావం విఫలమై బయట పడ్డ పిల్లలు, మాదకద్రవ్యాల ప్రభావంతో గర్భస్థ పిండాలు దెబ్బతిని పుట్టిన పిల్లలు చాలామంది బతికి బట్టకట్టలేరు. ఎన్నోసార్లు అలా మృత్యుముఖంలో ఉన్న పిల్లల్ని సిస్టర్స్ దగ్గరకు తీసుకువచ్చేవారు. ఎలాగు ఒక గంటలో కన్ను మూయబోయే పిల్లలపట్ల, అంత సమయమూ, ధనమూ వ్యం చేయడంవల్ల తమ సంస్థకేమైనా ప్రయోజనం ఉందా అని చాలాసార్లు మదర్‌ను అడిగేవారు. వాళ్ళ శ్రమను మరింత ఉపయోగకరమైన వాటిల్లో పెట్టవచ్చు కదా అన్నప్పుడు మదర్ తెరీసా కోపంతో 'పిల్లలు క్షణాల్లో చనిపోతున్నాగాని, ఎవరూ పట్టించుకోకుండా నిరాదరణకు గురై చనిపోకూడదు. పసి పిల్లలు కూడా మానవ ఆదరాన్ని అర్థం చేసుకుంటారు. అందుకనే చనిపోతూ కలకత్తాలో ప్రతి బిడ్డనీ మదర్ తెరీసా ఆదరిస్తారని అందరికీ తెలుసు. ఎవరికైనా బిడ్డలు అక్కర్లేకుంటే మదర్ తెరీసా దగ్గరకు పంపమని వాళ్ళను చనిపోనివ్వకూడదని చెప్పేవారు. మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ఏ పిల్లలనైనా ఆదరిస్తారు. మదర్ తెరీసా దృష్టిలో ప్రతి శిశువూ విలువైందే. ప్రతిశిశువూ దేవుని సృష్టే.

శిశుభవన్‌లో చేరిన బిడ్డలవి ఎన్నో విషాదగాథలు. బాపి అనే పిల్లవాని విషాదగాథ గురించి తెలుసుకుందాం. ఆ బిడ్డ ఎన్నో సమస్యలతో పుట్టాడు. భార్యాభర్తలిద్దరూ ఆ బిడ్డను అనేక ఆస్పత్రులలో చూపించారు. ఆ తరువాత భర్త చనిపోవడంతో తల్లీ, పిల్లవాడు దిక్కులేని వారయ్యారు. డాక్టర్లు ఆ పిల్లవాడు బాగుపడదని చెప్పేవారు. కన్నతల్లి పిల్లవాడిని

వదులుకోలేదు. అలాగని పనికి వెళ్ళేప్పుడు వెంట తీసుకెళ్ళ లేదు. ఆ పిల్లవాడికి వెన్నుపూస లోపం వలన ఏ మాత్రం కదలలేడు. చెవుడు, మూగ, కళ్ళు పెద్దగా ఉంటాయి. మనసులో వున్న దాని కళ్ళతోనే తెలియజేస్తాడు. సంతోషంగా ఉన్నప్పుడు కళ్ళు మిలమిల మెరుస్తాయి. విచారంగా వుంటే ముఖం ఎర్రబడు తుంది. చెక్కిళ్ళ మీద కన్నీళ్ళు కారతాయి. ఏదన్నా అడిగితే నోరు బాగా తెరిచి, అబ్బా అంటున్నట్టు నిట్టూరుస్తాడు. ఈ పిల్లవాడిని మదర్ తెరీసా ఆదరించి శిశుభవన్‌లో చేర్చుకు న్నారు. ఆ తల్లి బాధ తీరింది. చల్లని హస్తాల్లో ఆ బిడ్డ ఉంచ బడిందని తృప్తిగా వెళ్ళిపోయింది. తరువాత ఎప్పుడూ శిశుభవన్‌కు రాలేదంటే, చనిపోయిం దేమో. సిస్టర్లు ఆ పిల్లవానికి బాపి అని పేరు పెట్టారు. బాపి సైగలతో అతని భాషను సిస్టర్లు అర్థం చేసుకుని కంటికి రెప్పలా చూసుకుంటూ ఉండేవారు. ఆ పిల్లవాడు కూర్చోవాలను కుంటున్నా, పడుకోవాలనుకుంటున్నా, టాయిలెట్‌కి తీసుకెళ్ళం డని అంటున్నా, చక్రాల కుర్చీలోకి తీసుకు వెళ్ళండని చెప్పాలను కున్నా అతని సైగనుబట్టి అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు. అతడు ఉల్లాసంగా ఎప్పుడుంటాడో, ఎప్పుడు కళ్ళమ్మట నీళ్ళు తిరుగుతాయో వాళ్ళు గ్రహించగలరు. తమ సంరక్షణలో ఉండే యితర పిల్లల్ని ఎంతలా వెయ్యికళ్ళతో చూసుకుంటారో, అంతలా బాపీని చూసుకోవడం వాళ్ళకు సహజం. బాపిది చక్కని ముఖం, నల్లని కనుబొమ్మలు. ప్రతి గంటకోసారి ద్రవాహారం ఇస్తారు. ఈ విధమైన సంరక్షణలో బాపి పదహారు సంవత్సరాల వయసు వరకు బ్రతికి చని పోయాడు. ఇలాటి విషాదగాథలు ఎన్నో శిశుభవన్‌లో ఉంటాయి.

బాపివంటి బిడ్డ విషయం ఈ మధ్య పేపర్‌లో ప్రచురిం చారు. పుట్టినప్పటి నుండి ఏడుపే తెలియని శిశువుకు జన్మ నిచ్చిన తల్లిబాధను వ్రాశారు. ఆ బిడ్డ ఏడుపు, నవ్వు తెలియ నిది. ఏడు సంవత్సరాల వయసు వచ్చినా ఆకలే తెలియని చిన్నవారికి ఆకలి తీర్చి కంటికి రెప్పలా కాపాడటం ఆ తల్లికి ఎంత కష్టం. ఆకలి ఏడుపులు ఏడవ లేదు. మాట్లాడలేదు. మౌనంగా చూస్తూ ఉంటుంది. శరీరం పెరుగుతున్నా దేహం పై కండ పెరగటం లేదు. ఎముకలు తేలి వుంటుంది. అటువంటి ఆ పాపను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తుంది ఆమె తల్లి. హైదరాబాద్‌లోని లాలాపేట ప్రశాంత్ నగర్‌లో శ్రీనివాస్, రజిని అనే తల్లిదండ్రులకు తొలి సంతానంగా 2004లో జ్యోతి అనే ఈ పాప జన్మించింది. పుట్టినప్పటి నుండి ఆ కూతురు ఏడుపు అనేది ఎరుగదు. ఏడిపించడానికి వైద్యులు శత విధాల ప్రయత్నించినా ఫలితం రాలేదు. చిరునవ్వులు, ఏడుపులులేని ఆ బిడ్డకు వారు జ్యోతి అని నామకరణం చేశారు. ఆ పాప పేరుతోనే శ్రీనివాస్ ప్రశాంత్‌నగర్‌లో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. జ్యోతి ఆరోగ్య విషయంలో ఎందరో వైద్యులను కలిసినా లాభం లేకపోయిందని ఆ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. తన బిడ్డ జ్యోతి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు ఛాలెంజ్‌గా తీసుకొని బాగుచేస్తే తమ శక్తి కొద్దీ అప్పో సొప్పో చేసి డబ్బులు ఇస్తామన్నారు. తమ బిడ్డ విషయంలో ఏనాడూ విసుకు చెందలేదని, ఈ జ్యోతిని ఆరిపోకుండా చేస్తే వారి ఆనందనా నికి అవధులు ఉండవని అంతర్జాతీయస్థాయి వైద్యులతో వైద్యం చేయించాలని కోరుతున్నారు. ఈ తల్లిదండ్రులకున్న బిడ్డ లాంటి బాపిని మదర్ తెరీసా పదహారు సంవత్సరాల వయసు వరకు పెంచిందంటే ఎంత ఆదరణ చూపించారో గదా!

సూపర్ సాకర్ హీరో అయిన డీగో మారడోనా కలకత్తా పర్యటన వెనుక ఆయన కోరిక వెలిబుచ్చారు. మదర్ తెరీసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్‌ను సందర్శించాలనే డీగో మారడోనా స్వప్నం సాకారమయ్యిందంట. డిసెంబరు 2008, రెండవవారం డిగో మారడోనా మదర్ హౌస్‌లో అడుగుపెట్ట గానే పక్షవాతంతో బాధపడుతున్న ఎనిమిదేళ్ళ చిన్నారి మేఘను ఆత్మీయంగా దగ్గరు తీసుకుని ముద్దాడాడు. ప్రతిఫలంగా మేఘ భారత క్రికెటర్లు ధరించే నీలంరంగు టోపీని మారడోనాకు బహుకరించింది. అనంతరం తన కోసం వేచి చూస్తున్న నలభైమంది చిన్నారులను కూడా మారడోనా ఆప్యాయంగా ముద్దాడాడు. మదర్ హౌస్‌ను సందర్శించడం ద్వారా కోల్‌కతాలో తన పర్యటన లక్ష్యం నెరవేరిందని ప్రస్తుతం అర్జెంటీనా జాతీయ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్న ఈ సాకర్ మాంత్రికుడు పేర్కొన్నారు. ఫ్రెంచ్ భాష తెలిసిన నన్ ఒకరు మదర్ తెరీసా బోధలను, ఆమె చేసిన సేవలను మారడోనాకు వివరించారు. అనంతరరం మదర్ సమాధిని సందర్శించి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ విధంగా ప్రపంచంలో ఎందరికో మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థ సందర్శన ప్రియమైన స్థలంగా మారింది.

పెద్ద కథ

# విశ్వాసంలో ఓ మెట్టు

ఒంగోలు మిషన్ హాస్పిటల్‌కి బ్రేస్టడ్స్ అనే క్రొత్త డాక్టరు అమెరికా నుండి వచ్చారు. ఆయన సామ్యేలును పరీక్షించి, కుడికాలు గిలకవద్ద బోన్ టి.బి. (ఎముక క్షయ) అని తేల్చారు. ట్రీట్‌మెంట్‌కు రాయవేలూరు మిషన్ హాస్పిటల్‌కి వెళ్ళమన్నారు.

ఆ సమయంలో సామ్యేలు తల్లిదండ్రులు దేవుని సేవ చెయ్యాలని ఉద్యోగాలు మానేసి విశ్వాసంతో సేవ చేస్తున్నారు. సామ్యేలు పెద్దనాన్న కుమార్తె మిల్‌రెడ్ భర్త చిలక సామ్యేలుగారు రైల్వేలో టి.టిగా పనిచేస్తూ సామ్యేలును తండ్రి కృపాదానమును మద్రాసు వరకు తీసుకొని వెళ్ళారు. ఇంక రాయవేలూరు వెళ్ళవలసి వుంది. మద్రాసులో సామ్యేలు పెద్దనాన్న మరో కుమార్తె కమలమ్మ టీచర్‌గా ట్రిప్లికేన్‌లో కాపురమున్నారు. వారి ఇంటికి వెళ్ళారు. అక్కడ గవర్నమెంటు ఆస్పత్రిలో పరీక్ష చేయించింది. ఆ హాస్పిటల్లో కూడ పరీక్ష చేసి ఇది బోన్ టి.బి. ఇప్పుడు గుంటూరు గవర్నమెంటు ఆస్పత్రిని జనరల్ హాస్పిటల్‌గా మార్చారు. ఇక్కడ స్పెషలిస్టు డా॥ ఎతిరాజులు గుంటూరు బదిలీ అయ్యారు అని కాగితాలు వ్రాసి ఇచ్చారు. వెయ్యి దీపాలు వీధిలో (థౌజండ్‌లైట్స్ స్ట్రీట్) సామ్యేలు కాలుకు ఒక ఇనుప చట్రం చేయించారు.

సామ్యేలు అక్క కమ్మలమ్మగారు నాటి వర్ధమాన సినీనటి రాజసులోచనకి ఇంగ్లీషు ట్యూటర్‌గా పనిచేస్తూ ఉన్నందున ఆమె ఇంటికి సామ్యేలును తీసికొని వెళ్తానన్నది. ఆదివారం సామ్యేలు సిద్ధపడి వుంటే తన తండ్రి ఆరాధనకు బయలుదేరమన్నాడు. సినిమా యాక్టరును చూస్తానన్న సంతోషం కాస్త దుఃఖగా మారిపోయింది. ఆ ప్రార్ధన ఉదయం పది గంటల నుండి సాయంకాలం మూడు గంటల వరకు సాగింది. ఆఖరిలో కానుకలు వేసేటప్పుడు కర్రమీద గెంతుతూ వరుసలో వెళ్ళి పెట్టెలో కానుక వేసి మరలా కుంటు కుంటూ వచ్చారు. సినిమా యాక్టరును చూడలేదన్న విచారము హృదయం నిండా వుంది. ప్రార్ధన అయిపోయిన తర్వాత తండ్రి సామ్యేలును అక్కడ వున్న సహోదరుల వద్దకు తీసుకెళ్ళి తన కుమారుని రుగ్మత విషయం చెప్పి తెల్లకాగితం మీద సామ్యేలు విషయం వ్రాసి ప్రార్ధన అవసరత చెప్పారు.

తర్వాత గుంటూరు జనరల్ హాస్పిటల్‌కి వెళ్తే డాక్టర్ ఎతిరాజులుగారు సామ్యేలును హాస్పిటల్లో చేర్చుకున్నారు. సామ్యేలు ఏనాడు దేవుని ప్రార్ధించికాని, బైబిలు చదువుకొని ఎరుగడు. హాస్పిటల్లో మూడు నెలలు గడచిన తర్వాత ఒకరోజు రాత్రి కలలో సామ్యేలు మద్రాసులోని ఆ ప్రార్ధనా మందిరంలో నడుస్తూ, పాటపాడుతూ కానుక పెట్టె వద్దకు వెళ్ళి కానుక వేసినట్టు చూశాడు. మరునాడు తెల్లవారి నుండి సామ్యేలు నడవటం ప్రారంభించాడు.

నీవు నాకు నీ కొరకు ప్రార్ధించక పోయినా మద్రాసులోని ఆ మందిరములోని నా బిడ్డలు నీ కొరకు చేసిన ప్రార్ధన విని నిన్ను స్వస్థపరిచాను అని ప్రభువు రాత్రి స్వప్నము ద్వారా తెలియజేసినట్లు సామ్యేలు గ్రహించాడు. కాని కృతజ్ఞతగా ప్రార్ధించలేదు. అప్పటి నుండి ఇప్పటి వరకు కుడికాలు గిలకలో బోన్ టి.బి. యొక్క ఛాయలు కనబడుతూనే ఉన్నా ఇప్పుడు ఈ గవర్నమెంటు ఎముకల డాక్టరు బోన్ టి.బి. అనే జబ్బే లేదు, ఇది మడిమఘాల అంటున్నాడు. ఎట్లాగయితేనేమి (నిపుణుని అభిప్రాయము) పరీక్ష నిమిత్తము గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు సామ్యేలును పంపించారు. అక్కడ మెడికల్ బోర్డును కలవమన్నారు. అందుకై సామ్యేలును ఒంగోలు గుంటూరు, గుంటూరు ఒంగోలు ఆరుసార్లు త్రిప్పారు. చివరికి మెడికల్ బోర్డు వారు సామ్యేలును పిలిచి నీవు ఏ విధంగా కోరితే ఆ విధంగా సర్టిఫికేట్ ఇస్తాము ముందు మా సంగతి తేల్చు అన్నారు.

నా కాలుకి జబ్బు వుంటే ఉందని లేకుంటే లేదని వ్రాయండి అని అన్నాడు సామ్యేలు. సరే నువ్వు వెళ్ళు మేము వ్రాసి హాస్పిటల్‌కి పంపిస్తాము అని హాస్పిటల్లో మూడు రోజులు పెషెంటుగా చేర్చి, అనవసరంగా రక్తపరీక్షలు, ఎక్స్‌రేలు తీసి పంపించారు. గుంటూరు హాస్పిటల్ వారిచ్చిన కాగితాలు అవి సామ్యేలు బహు జాగ్రత్తగా భద్రపరిచాడు.

రెండు నెలల తర్వాత ఒంగోలు హాస్పిటల్ వారు గుంటూరు హాస్పిటల్ వారిని సామ్యేలు వ్యవహారం విషయం అడిగారు. అసలు సామ్యేలు అనే వాడు ఎవరు మా దగ్గరకు రాలేదని జవాబు వచ్చింది. అందుకుగాను సామ్యేలు ఒంగోలు హాస్పిటల్ వారికి తాను గుంటూరు హాస్పిటల్లో చేరిన కాగితాలు,

ఎక్స్‌రే, రక్తపరీక్ష కాగితాలు చూపించాడు.

తర్వాత ఇక సామ్యేలు విషయం ఎవరూ పట్టించు కోలేదు. సామ్యేలు కూడా ఇంతటితో ఈ కథ ముగిస్తే మంచిదని మౌనంగా ఉన్నాడు. 1978 డిసెంబరు 21న తన భార్య పుష్పాంజలి చనిపోయిన నాటినుండి ఈ పద్నాలుగు సంవత్సరాలు కనీసం పెద్ద మనిషి అని అనిపించుకోడానికి కూడా యోగ్యులు కాని కొందరు ఆఫీసర్లకి చెయ్యెత్తి నమస్కారం చేయటం మొదలు మానవుల శరీరాల్లో హాస్పిటల్లో కుళ్ళిపోయిన దానికంటే భరించలేని నీచమానవ హృదయాలు ఎన్నో ఎలా వాసన విరజిమ్మి ప్రక్కనున్న వారి హృదయాలను కూడా కుళ్ళిపోచూస్తారో తలచుకుంటే మానవజాతి ఎంత హీనమైపోయిందో తెలుస్తుంది.

ఇక ఈ హాస్పిటల్ వ్యవహారానికి ఉద్యోగ వ్యవహారానికి తిలోదకాలిచ్చి నెమ్మదిగా జీవించాలని, ఇక ఎన్నటికీ తను ఉద్యోగం చేసిన పరిసరాల్లోకి కూడా పోకూడదని నిశ్చయిం చుకున్నాడు. ఉద్యోగపర్వం తన హృదయంలో నుండి పూర్తిగా తుడిచిపెట్టుకొని పోవాలని కోరుకున్నాడు.

1974లో తను తన తండ్రితో విభేదించి బయటకు వచ్చే వరకు బి.ఏ. పాసైన తర్వాత తన తండ్రితో కలసి పదమూడు సంవత్సరాలు పనిచేసిన తన తండ్రి ఇంటికి వచ్చాడు. చర్చి బిల్డింగులోని దక్షిణ వరండా మొత్తం ఆఫీసుగా మార్చి పడమటి చివరిలో తన తండ్రి, –తూర్పు చివరిలో తన ఆఫీసు ఉండేవి. ఈ రెండింటి మధ్యలో అయిదుగురు గుమస్తాలు వరుసగా కూర్చుని పని చేసేవారు. ప్రతిరోజు ఎంతోమంది అనేక ప్రాంతాల నుండి తన తండ్రిని దర్శించి, తమ గోడు చెప్పుకొని సహాయం పొందేవారు అయిదుగురు గుమస్తాలతో అనాథ శరణాలయము పని తను చేస్తుండేవాడు. ఇప్పుడు ఆ ఆఫీసు మరలా వరండాగా మారిపోయింది. తండ్రి ఆఫీసులో ముందు ఉన్న పంచ పైభాగము కొంత కూలిపోయి ఉన్నది. చిల్లచెట్లు ఆఫీసులోనికి రాకుండా అడ్డుకున్నాయి.

లోపల అద్దాల బీరువా నిండా చిత్తు కాగితాలు ఉన్నాయి. అవి ఏమి కాగితాలో చూశాడు. అవన్నీ ఇంగ్లీషులో బైబిలు కామెంటరీలు. రామాయపట్నంలో 1953 నుండి 55 వరకు తన తండ్రి చదివిన బైబిల్ కామెంటరీలు. ఆఫీసులో కరెంటు లేదు. గోడలన్నీ మాచికలు. అదంతా శుభ్రపరచి, కరెంటు ఏర్పరచి, బీరువాలోని కాగితాలు అన్ని అతికించి బైండింగులుగా తయారు చేస్తే పదకొండు విలువైన సెమినరీ పుస్తకాలు తయారయ్యాయి. వాటిలో కొన్నింటిని చదువు తున్నప్పుడు 1953లో రామాయపట్నంలో తన తల్లిదండ్రులు సెమినరీ చదివిన రోజులు గుర్తుకొచ్చాయి. తను కూడా తన కుటుంబముతో రామాయపట్నంలో మూడు సంవత్సరాలు బైబిలు కోర్సు చేస్తే బాగుంటుంది కదా అని ఆలోచించాడు.

వెంటనే రామాయపట్నం వెళ్ళాడు. ఒంగోలుకు ముప్పైఐదు మైళ్ళ దూరంలో కావలికి పది మైళ్ళ దూరంలో సముద్ర తీరాన ఉన్న బాప్టిస్టు థియోలాజికల్ సెమినరీ ప్రిన్సిపల్‌ని కలిశాడు. నూటపది ఎకరాలలో ఎన్నో బిల్డింగ్స్, ఏత్తైన శిఖరము కలిగిన చర్చిని చూస్తే చిన్ననాటి అనుభవాలు గుర్తుకు వచ్చాయి. అయితే 1954లో ఉన్న సెమినరీకి ఇప్పటి ఈ సంస్థకి ఏ సంబంధము కనబడలేదు. ఒకప్పుడు పరలోక మును పోలిన సెమినరీ ఇప్పుడు అంతా నిశ్శబ్దం గాను, జీవరహితముగా ఎవరో శోకించి, శోకించి అలసిపోయి మౌనంగా ఉన్నారా? అనిపించింది. ఆనాటి మనుష్యు సందడి, పెద్ద పెద్ద మఱ్ఱిచెట్లు, జీవిత ప్రకాశిని పాఠశాల ఏమీ లేవు. తెల్లవారంతా వెళ్ళిపోయారు. ఇప్పుడు భారతీయుల పరి పాలనలో ఉంది.

సెమినరీ ప్రెసిడెంటుగారిని కలిసి ఈ సెమినరీలో కుటుంబముతో కలసి సెమినరీ చెయ్యాలన్న కోరిక తెలియ పరిచాడు. అయితే ఆయన 'మీరు బాప్టిస్టు మిషన్‌కి సంబంధం లేనివారు కదా. మీరు ఇక్కడ చదవాలంటే నెలకు వెయ్యి రూపాయలు కట్టాలి' అన్నారు. తర్వాత ఒక న్యూస్ పేపర్లో అడ్రసు చూచి ఏలూరులోని ఒక బైబిలు కళాశాలకు వెళ్ళాడు. వారు 'మీ భార్యభర్తలకు వసతి చూడగలము కాని, మీ పిల్లలతో నిశించటానికి వీలుండదు' అన్నారు. నిండా నిరాశతో ఒంగోలు తిరిగి వచ్చాడు సామ్యేలు. తను బైండింగ్ చేసికొనిన తన తండ్రి సెమినరీ చేసిన పుస్తకాలు తన ఎదురుగా ఉన్నవి. తలవంచి 'ప్రభువా మా తండ్రిగారు మూడు సంవత్సరాలు బైబిలు పుస్తకాలు నీవే నాకు చూపించి ఇచ్చావు. నేను ఈ రోజు నుండి ఇదే స్థలంలో మూడు సంవత్సరాలు కదలకుండా కూర్చుని ఇక్కడే సెమినరీ చేస్తాను. రాబోయే మూడు సంవత్సరాలు వస్త్రాలు కొననవరము లేదు. కరెండు బిల్లు ఉమ్మడిలో పోతుంది. ఇంటి అద్దె లేదు. పిల్లలకు ఫీజులు లేవు. కాకపోతే తినటానికి తిండి మాత్రము నువ్వు నాకు ఇవ్వు' అని ప్రార్థన చేసుకున్నాడు.

క్విజ్ **ఫిబ్రవరి నెల ప్రశ్న?** 51

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచుటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

1. బత్షెబ పేరు చెడునకు గుర్తుగా మిగిలిపోయింది. కాని ఆమె భర్త వంశము, ఆమె వంశము చాలా గొప్పది. వారెవరు?
2. గాతు వాడైన గొల్యాతు దావీదు చేతిలో చని పోయాడు. కాని అదే గాతు నుండి వచ్చిన వారు దావీదు అనుచరులు. వారెవరు? ఎంతమంది?

(రెండవ సమూయేలు గ్రంథము నుండి)

**జవాబులు వ్రాసిన వారు :**

శ్రీమతి బత్తుల ఆనీమేరి, హైదరాబాదు

శ్రీమతి పి.జె. సత్యవాణి, తెనాలి

శ్రీమతి నిర్మల మాథ్యూస్, ఒంగోలు

శ్రీమతి క్రాంతికుమారి, ఉప్పుగుండూరు

శ్రీమతి సంపూర్ణ సాల్మన్‌రాజు, నర్సరావుపేట

శ్రీమతి గుత్తికొండ అన్నమ్మ దానియేలు, నర్సరావుపేట

కుమారి తాతపూడి ప్రవీణ, చెన్నై

**జనవరి నెల ప్రశ్నలకు జవాబులు :**

**జవాబు:**

1. బేత్లెహేమనబడిన దావీదు ఊరిలో యేసు జన్మించి నపుడు, సున్నతి చేయవలసిన ఎనిమిదవ దినమున దేవదూత చేత పెట్టబడిన 'యేసు' అను పేరు ఆయనకు పెట్టిరి (లూకా 2:5-7, 21)
2. ముప్పది మూడు దినములు సంపూర్తి అయిన తరువాత శద్ధి చేసుకొను దినములు గడిచినపుడు (లేవి.12:4, లూకా 2:22-24)

**చందా పంపదలచిన వారు :**
మా యొక్క బ్యాంక్ (S.B.I.) ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా పంపవచ్చును.

నెం.**10957294362**

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఒంగోలు

కె. సామ్యేల్ రాజేంద్ర

**ఈ నెల పోషకులు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| శ్రీ రాజామణి | యు.ఎస్.ఎ. | 2300 | శ్రీ తాడిగిరి విజయకుమార్ | గుంటూరు | 500 |
| బిషప్ రెవ.డా॥యం.ఎస్.శాంతవర్ధన్ | గుంటూరు | 2000 | శ్రీ సొలొమోన్ రాజు | నరసారావుపేట | 300 |
| డా॥ పి. హుస్సేనయ్య | బెస్తవారిపేట | 1000 | శ్రీ కె.జె.డబ్ల్యు. జయకుమార్ | నెల్లూరు | 200 |
| రెవ.డా॥ కె. జోసఫ్ | ఒంగోలు | 1000 | శ్రీ నాగెళ్ళ ఏలియా | కర్నూలు | 200 |
| శ్రీ జెడ్.సి. దేవదానం | కర్నూలు | 700 | డా॥ బాబు దేవిడ్ లివింగ్‌స్టన్ | మార్కాపురం | 200 |
| శ్రీమతి లూర్దుమేరి | కర్నూలు | 650 | రెవ. థియోఫిలాస్ | పులివెందుల | 200 |
| అపొ. ఎబినెజరు | హైదరాబాద్ | 600 | శ్రీ వి. ఎడ్విన్ పాల్‌రాజు | కర్నూలు | 200 |
| శ్రీమతి శారా మార్గరెట్ | కమలాపురం | 500 | శ్రీ ఆర్థర్ ప్రసన్న కుమార్ | కర్నూలు | 200 |
| రెవ.డా॥ కె. సామ్రాట్ | ఒంగోలు | 500 | శ్రీ జె. ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీ సిరప్ప | అనంతపురం | 500 | శ్రీమతి కె. సౌభాగ్యమ్మ | ఒంగోలు | 200 |
| శ్రీమతి కమలమ్మ | పులివెందుల | 500 | శ్రీ డి. పురుషోత్తం | ఒంగోలు | 150 |
| శ్రీ రాజారావు | కాకినాడ | 500 | శ్రీమతి టి. గ్రేస్ ప్రకాష్ | విశాఖపట్నం | 150 |
| శ్రీ ముక్కు బాలక్రిష్ణారెడ్డి, రామక్రిష్ణమఠం, | కనిగిరి | 500 | శ్రీమతి శాంతం | విశాఖపట్నం | 150 |
| శ్రీ అబ్రాహాం లింకన్ | నరసారావుపేట | 500 | శ్రీమతి అవ్వమ్మ | హైదరాబాద్ | 150 |

# ఇది పరిశుద్ధాత్మయేనా లేక కర్ణపిశాచా? ౨

**(బైబిలు ఉపదేశిని - బైబిల్ కౌన్సిలింగ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా)**

**మనము త్రాగుబోతులం లేదా ఏదైనా లైంగిక పాపంలో చిక్కుకోవాలని సాతాను కోరిన యెడల అతడు మనతో ఏమని గుసగుసలాడుతాడు?**

చెడు అయిన దానిని చేయడానికి సాతాను మనల్ని ఎలా శోధిస్తాడు లేక మనకు ఎలా ఎరవేస్తాడు? ఖచ్చితంగా ఈ క్రిందివి మూడు ప్రధానాంశాలుగా ఉంటాయి. 1. ప్రార్థించవద్దు 2. దాని గురించి ఆలోచించవద్దు 3. అది బాగున్నదని అనిపిస్తుంది. ఆ అబద్ధ ప్రవక్త మిషనరీ చెబుతున్న ఆ మాటలే మనకు చెబుతాడు!

'కర్ణ పిశాచి', 'ఆత్మను వధిస్తున్న' ఆ 'అబద్ధ ప్రవక్తల'తో కలసి సన్నిహితంగా పనిచేస్తున్నాడు.

'ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలువెళ్ళియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి' (1యోహాను 4:1).

**'ప్రతి ఆత్మను నమ్మక' అనేక మాటలను మనము తీవ్రమైనవిగా పరిగణించాలి**

పవిత్రాత్మలతో కలసి అబద్ధ ప్రవక్తలు పనిచేస్తున్నారన్న ఒక సర్వసాధారణమైన కథ చెప్పడం వలన మీరు ఈ సంగతులు నమ్ముతారని నేను ఎదురు చూడలేదు. కాని ముఖ్య విషయం ఇది. మీరు లేఖనాలను పరిశీలించి నిజమైన పరిశుద్ధాత్మను గురించి అధికంగా తెలుసుకోవాలనుకుంటున్నారా? లేక మీరు ఈ సంగతులను గురించి భావించి దానినిబట్టి చెప్పే అర్థం వివరణలపై ఆధారపడతారా? నిజమైన పరిశుద్ధాత్మయే బైబిలు వ్రాసింది. ఆ బైబిల్లోనే మనం ఈ సత్యం తెలుసుకుంటాం.

**గుర్తుంచుకోండి, సాతాను మనల్ని 'పవిత్రంగా భావించు'కోమని కోరుతాడు, 'పవిత్రంగా ఉండ'మని కాదు**

మనము పవిత్రులమని భావించుకొనునట్లు మనకు కొంత అనుభవం కలుగజేయడానికి ఎంతో కష్టపడి పనిచేస్తాడు. దీన్ని మీరు మరింత విశదంగా పరిశీలించడం అవసరం, ఎందుకంటే జరుగుతున్నది ఖచ్చితంగా అదే గనుక. ఆ విధంగా సాతాను, దేవుని వాక్యం పునాదిగా కాని దాన్ని పవిత్రమైన (పరిశుద్ధమైన)దని మనం నమ్మునట్లు చేయ ప్రయత్నిస్తాడు. ఔను, వాక్య జ్ఞానం మనల్ని నడిపించటం అతనికిష్టం లేదు! మనం మన అనుభవ జ్ఞానంపై ఆధారపడే మంచి, చెడులను పరీక్షించమని కోరతాడు. మనకు లోకాతీత అనుభవ జ్ఞానం ప్రసాదించడానికి సాతాను తన స్వాధీనంలో వున్న సమస్తమూ చేస్తాడు. నిజమైన పరిశుద్ధాత్మను గురించి, మనుష్యుల ఆత్మల కోసం కొనసాగుతున్న పోరాటం గురించి కొన్ని సంగతులు తెలుసుకుందాం.

**చారిత్రాత్మకమైన పరిశుద్ధాత్మ వేదాంతం బైబిల్లో ఎక్కడ ప్రారంభమైందో అక్కడే మనం ప్రారంభిద్దాం**

**1. పరిశుద్ధాత్మ దేవుడు సదా ఉన్నాడు :** దేవునిగా వున్న పరిశుద్ధాత్ముడు సృష్టింపబడలేదు, తయారు చేయబడలేదు కాని శాశ్వతంగా ఉన్నాడు. అసలు బైబిల్లోని మొట్టమొదటి పదమే దేవుడు, అంటే మనతో చేసిన నిబంధనను నెరవేర్చే త్రిత్వమైన దేవుడు. ఇందులో తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ ముగ్గురు వేరు వేరు పురుషులుగా ఉన్నప్పటికీ ఒక దేవుడై ఉన్నాడు.

మరో ప్రక్క సాతాను సృష్టింపబడిన జీవి, 'కర్ణపిశాచు'లకు తండ్రి. పతనమైన దూత. గుర్తుంచుకోండి, దూతలందరూ సృష్టింపబడిన జీవులే. కృపను కోల్పోయి పతనమైన వారితో సహా! లోకంలో చెడు ఎందుకు ఉన్నదో రోమా 9:22-23 మీకు కొంత అవగాహన కలిగిస్తుంది.

**2. దేవునిగా పరిశుద్ధాత్మ లోకాన్ని సృష్టించాడు :** సృష్టి క్రమంలో పరిశుద్ధాత్మ జోక్యం కలిగి ఉన్నాడని ఆదికాండం 1:1-2 వచనాలనుబట్టి మనకు తెలుసు. 'దేవుని ఆత్మ జలములపై అల్లాడుచుండెను' అను మాటలు పరిశుద్ధాత్మను గురించి చెప్తున్నాయి. అప్పుడు దేవుడు చేసిన దానిని 'మంచిది' అని ప్రకటించాడు. దీనికి భిన్నంగా 'కర్ణపిశాచి' మంచిది అయిన దానిని నాశనం చేయడానికి కృషి చేస్తున్నాడు.

3. దేవునిగా పరిశుద్ధాత్మ నరుని సృష్టించాడు : 'దేవుడు –

(...మిగతా 13వ పేజీలో)

ఎంతకాలం?

# ఆ రాత్రి చేసిన పాపమే...?

**(డా॥ పి. సతీష్‌కుమార్, కల్వరి టెంపుల్, హైదరాబాద్‌వారి రచన)**

పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఎలాగైనా, ఎంత కష్టమైనా పి.జి. పూర్తి చేయాలని అనుకుంటూ పుస్తకాలు తెరిచాడు రవి. చాలా ప్రొద్దుపోయే వరకు చదువుతూ ఉన్నాడు. అలా చదువుతూ ఉండగా తన తల్లి, చెల్లెళ్ళు జ్ఞాపకానికి వచ్చారు. తన తల్లి ప్రేమ చెల్లెళ్ళ అప్యాయత అనురాగం అన్నీ తన కళ్ళముందు కదిలాడాయి. తన చెల్లెళ్ళను చదివించి, పెళ్ళిళ్ళు చేయవలసిన బాధ్యత తన మీద ఎంతో వుంది. నేను ఎంత త్వరగా నా పరీక్షలు ముగించి అంత త్వరగా నా కుటుంబానికి అండగా నిలవాలి. వెంటనే మంచి ఉద్యోగం సంపాదించి తన పెద్ద చెల్లికి మంచి సంబంధం తీసుకొచ్చి పెళ్ళి చేయాలి. మిగిలిన చెల్లెళ్ళను పై చదువులు చదివించి వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడేలా చేయాలి అని అనుకుంటూ తన వాచ్ చూసుకున్నాడు. రాత్రి 2-30 గంటలయింది. పుస్తకాలు ప్రక్కన పెట్టి పడుకున్నాడు.

ఏంరా రవి! ఎప్పుడు చూసినా ఏదో లోకంలో ఉంటావు. కాస్త అప్పుడప్పుడు నీ ప్రక్కనున్న మమ్మల్ని కూడా గమనిస్తూ ఉండరా! అని వేళాకోలం చేశాడు రాజు. మీకేంట్రా.... బరువా? బాధ్యతా? అన్నాడు. ఏంట్రా! నీకొక్కడికే బరువు బాధ్యతా, ప్రపంచంలో నీవొక్కడివే కుటుంబాన్ని ఉద్ధరించాలని కంకణం కట్టుకున్నట్లు మాట్లాడుతున్నావ్! మాక్కూడా బరువు బాధ్యతలు ఉన్నాయి. వాటి సమయాల్లో అవి ఎలాగో మోయాలి. అందుకని ఇప్పట్నుంచే మోయమంటావా? నీవేమైనా 30, 40 సం॥లు నిండిన వాడివా? బాధ్యతల గురించి ఆలోచించడానికి! ఊరికే వేదాంతం మాట్లాడుకురా! నవ్వుతారు అన్నాడు రమేష్. అది కాదురా నా పరిస్థితిలో మీరు లేరు అని రవి అంటుంటే... ఒరేయ్ అవన్నీ తర్వాత చూద్దాంగానీ సినిమాకు వెళ్దాం రా! అన్నాడు రాజు. సినిమా అంటే ఎలా లేదన్నా 25/- రూపాయలు ఖర్చు అవుతాయి. ఆ 25/- రూపాయలతో నా చెల్లెళ్ళు, తల్లి ఒక పూట కడుపు నిండా భోజనం చేస్తారు. అమ్మో నేను వెళ్ళకూడదు అని తనలో తాను అనుకున్నాడు. ఒరేయ్ మరలా వీడు ఏదో లోకానికి వెళ్ళిపోయాడు అని హేళన చేస్తూ... వీడు ఇప్పట్లో ఆ లోకం నుండి బయటకు రాడు. వీడితో మనకెందుకు పోదాం రండి అని రమేష్ అంటుంటే హమ్మయ్య బ్రతికిపోయాను అని అనుకుంటూ హాస్టల్‌కి వచ్చాడు రవి. మరలా పుస్తకాలు పట్టుకుని కష్టపడి రాత్రంతా చదువుతూనే గడిపాడు.

మరుసటి రోజు రవి వాళ్ళ అమ్మ దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. ఎంతో ఆత్రుతతో చదువసాగాడు. అయ్యా! నీ పరీక్షల్లో నీవు మంచి మార్కులతో ఉత్తీర్ణుడవు కావాలని మన దేవుణ్ణి ఎంతో ఆసక్తితో ప్రార్ధన చేస్తున్నాను. నీవు పరీక్షలకు వెళ్ళే ముందు ప్రార్ధన చేసుకుని వెళ్ళడం మరువవద్దు. పరీక్షలు అయిపోగానే వెంటనే వచ్చేయి. నిన్ను చూడాలని వేయి కళ్ళతో ఎదురుచూస్తూ ఉంటాను. ఆ ఉత్తరం చదువుకుని, తన తల్లి ప్రేమానురాగాలు తలచుకొని ఎప్పుడు పరీక్షలు అయిపోతాయా ఇంటికి వెళ్ళి తల్లిని, చెల్లెళ్ళను చూద్దామా అని అనుకున్నాడు.

పరీక్షలు అయిపోయాయి. రేపు అందరూ వారి వారి ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు. ఈలోపు రాజు, గిరి మరికొందరు స్నేహితులు వచ్చి రారా! రవి అలా తిరిగొద్దాం. ఇప్పటి వరకు బాగా కష్టపడి చదివాము. రేపు ఎవరి దారిన వారు వెళ్ళిపోతున్నాం, కనీసం ఈ రాత్రన్నా కలిసి ఎంజాయ్ చేద్దాం అని బలవంతం చేస్తుంటే పరీక్షలు అయిపోయాయి కదా అని తనలో తాను అనుకొని వారు ఎక్కడికి తీసుకొని వెళ్తారో తెలియకుండానే వారితో బయలుదేరాడు. వారంతా ముందుగా ప్లాన్ చేసుకొని రవిని కూడా అక్కడకు తీసుకొచ్చారు.

అదంతా క్రొత్త ప్రదేశం. అది అంత మంచి ప్రదేశం కాదని దాన్ని చూస్తుంటే అర్థమవుతుంది. అంతా కలిసి రవిని కూడా లోపలికి తీసుకెళ్ళారు. అప్పుడు అర్థమయింది అది వ్యభిచార గృహమని. ఒక్కసారిగా ఖంగుతిన్నాడు ఛీ! ఛీ! అని అనుకుంటూ బయటకు రాబోయాడు. కాని వారు వదిలి పెట్టలేదు. బలవంతం చేశారు, హేళన చేశారు. నువ్వు మగాడివి కాదా! అని రెచ్చగొట్టారు. చివరికి ఆ భయంకరమైన రొంపిలోకి దింపారు. హాస్టల్ రూమ్‌కి వచ్చి ఛీ! ఛీ! అని తనను తాను నిందించుకోవడం మొదలు పెట్టాడు. అసలు వారితో

వెళ్ళకుండా ఉండాల్సింది. ఇంత ఘోరమైన పనికి దిగజార కుండా ఉండాల్సింది అని తనను తాను నిందించుకుంటూనే ఇంటికి బయలుదేరాడు.

తాను చేసిన పాపం తనకు తెలియకుండానే భయం సృష్టించింది. అమ్మతో, చెల్లెళ్ళతో ప్రేమతో మాట్లాడలేక పోతున్నాడు. ఏదో తెలియని వెలితి, ఎడబాటు, పరీక్షల్లో ఫలితాలు రానే వచ్చాయి. ఫస్టక్లాస్‌లో పాసయ్యాడు. ఫలితాలు రావడం ఆలస్యం, మంచి ఉద్యోగం కూడా వెతుక్కుంటూ వచ్చింది. తల్లి, చెల్లెళ్ళు తాను ఆనందంతో ఉప్పొంగిపోయారు. చాలామంచి జీతం. తల్లి ఎంతో సంతోషించింది. దేవుణ్ని స్తుతించింది. కుమారుణ్ని పిలిచి ప్రార్థించింది. ప్రార్థన చేస్తుం డగా రవి గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. తాను చేసిన పాపం తన కళ్ళముందే తచ్చాడింది. కొంతకాలమైన తర్వాత అతడు తన తల్లి, చెల్లెళ్ళతో కలిసి పట్టణానికి మకాం మార్చాడు. పెద్ద చెల్లికి మంచి సంబంధం వచ్చింది. పెళ్ళి ఖాయం అయింది. మిగిలిన ఇద్దరు చెల్లెళ్ళను కాలేజిలో చేర్పించాడు. ఘనంగా చెల్లి పెళ్ళి చేయాలని ఎన్నో కలలు కన్నాడు. తల్లీ, కూతుళ్ళ ఆనందానికి అవధులు లేవు. పెళ్ళి ఏర్పాట్లు అన్నీ జరుగు తున్నాయి. కాని కొంతకాలంగా రవికి తరచూ కళ్ళు తిరగటం, జ్వరం రావడం, ఆకలి లేకపోవడం జరుగుతుంది. ఏవో మాత్రలు వేసుకున్నాడు. అయినా తగ్గలేదు. ఒకవైపు పెళ్ళి దగ్గర పడుతుంటే రెండవవైపు తన శరీరంలో తనకు తెలియకుండానే పూర్తిగా నీరసపడిపోవడం తనకేమి అర్థం కాలేదు. ఎల్లుండే తన చెల్లికి పెళ్ళి. వెంటనే డాక్టరు దగ్గరకు ఆత్రుతతో వెళ్ళాడు. ఆ డాక్టరు అన్ని పరీక్షలు చేశాడు. రవికి చెమటలు పడుతున్నాయి. డాక్టరు కూడా టెన్షన్ ఫీలవుతు న్నాడు. అన్నీ టెస్టులు మరలా మరలా పరీక్షించాడు. అది చూస్తున్న రవికి ఎక్కువగా చెమటలు పట్టాయి. డాక్టర్! ఏమైంది నాకు? డాక్టర్ దీర్ఘంగా నిట్టూర్చి నీకు ఎయిడ్స్ రోగం తీవ్రంగా సోకింది. నాకు ఎయిడ్సా? నో!నో!నో! అని గట్టిగా అరిచాడు.

తన తల్లి, చెల్లెళ్ళు పెళ్ళికి సిద్ధమవుతున్న పెద్ద చెల్లి కళ్ళముందు కనిపించారు. నో! డాక్టర్ అలా జరగటానికి వీల్లేదు. నేనటువంటి వాడిని కాదు. ఆవేశపడకండి! మీరు ఎప్పుడైనా వేశ్యను కలిశారా! అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఆ రాత్రి చేసిన ఘోరం. అవును ఆ రాత్రి... ఆ రాత్రి ఎంత పని జరిగింది. అవును డాక్టర్ ఒకరాత్రి కలిశాను అన్నాడు. అదే దీనికి కారణం. మీలోవున్న ఎయిడ్స్ పూర్తిగా ముదిరి పోయింది. ఏంటి డాక్టర్? ఏంటి మీరంటున్నది? అవును నీకు మిగిలింది కొన్ని రోజులు మాత్రమే! ఎవరూ కూడా మిమ్మల్ని కాపాడలేరు. మీ వాళ్ళని వెంటనే పిలిపించండి అన్నాడు. ఆ మాటకే కుర్చీలో కూలబడిపోయాడు రవి. డాక్టర్! ఈ సంగతి మా వాళ్ళకు తెలియకూడదు. వారు ఈ వార్త విని బ్రతకలేరు, నేను లేకుండా నా తల్లి, చెల్లెళ్ళు బ్రతకలేరు. నేను ఉండి వారిని బ్రతికించలేను అని వేదనతో ఆవేదనతో రోడ్డు మీద నడుచుకుంటూ తన తల్లి, చెల్లెళ్ళు నేను లేకుండా ఎలా బ్రతకగలరనే ఆలోచనతో తనలో తాను మదనపడుతూ ఎదురుగా వస్తున్న లారీని గమనించకుండానే దానికి బలైపో యాడు. అయ్యో! ఆ ఒక్కరాత్రి క్షణికావేశానికి లోనుకాకుండా ఉంటే ఎంత బాగుండును. బట్ ఇట్ ఈస్ టూ లేట్.

ఆఫీసుకని వెళ్ళిన కుమారుడు రాకపోయేసరికి తల్లీ కూతుళ్ళు గుమ్మం దగ్గరే వేయి కళ్ళతో ఎదురు చూశారు. ఆ రోజు గడిచిపోయింది. అన్న రాలేదు. పెళ్ళిరోజు వచ్చింది కాని మనిషి పత్తా లేదు. ఏమైపోయాడు? పెళ్ళివారు నిల దీశారు? అన్యం పుణ్యం ఎరుగని ఆ తల్లీకూతుర్ల దగ్గర జవాబు లేదు. అన్న చేతుల మీదుగా వైభవంగా జరగాల్సిన పెళ్ళి అక్కడే ఆగిపోయింది. కనీసం గుర్తింపుకు కూడా నోచుకోని అన్న శవమేమో మార్చురీ గదిలో చేరిపోయింది. కారణం ఆ రాత్రి చేసిన పాపమే...!

ప్రియ స్నేహితుడా! నీ జీవితాన్ని నాశనం చేసుకోవ డానికి, జీవితాంతం దుఃఖించడానికి ఒక్క దురలవాటు చాలు! నీ జీవితం నాశనం చేయాలని సాతాను కంకణం కట్టు కున్నాడు. కనుక చెడు స్నేహితుల ద్వారా, చెడు అలవాట్ల ద్వారా నీ జీవితం పూర్తిగా నాశనం కాకమునుపే నీ మీద ఆధారపడిన వారిని దిక్కుమాలిన వారిగా చేసి నీవు పోక మునుపే నీ జీవితాన్ని ప్రభువైన యేసుక్రీస్తుకు అప్పగించి నీ పాత రోత జీవితాన్ని విడిచి పెట్టి నూతన వ్యక్తిగా జీవించు! నేడే ప్రార్థించు!!

"మీ అపవిత్రత పోవునట్లు మీ మీద శుద్ధ జలము చల్లుదును. మీకు కలిగిన అపవిత్రత అంతయు తీసివేతును. నూతన హృదయము మీకిచ్చెదను. నూతన స్వభావము మీకు కలుగజేసెదను" (యెహెజ్కేలు 36:25,26).

# దేవునితో సమాధానపడుట

ప్రభువునందు ప్రియమైనవారలారా, యేసుక్రీస్తు నామమందు అందరికీ శుభములు. ఈ క్రొత్త సంవత్సరములో మంచి నిర్ణయాలు చేసుకొని ఉంటారని నమ్ముతూ, అవి కొనసాగించే శక్తి దేవుడు మీకందరికీ ఇవ్వాలని ఆ దేవదేవుని కోరుతున్నాను. మనము ఈ క్రొత్త సంవత్సరములో దేవునితో సమాధానంగా ఉండాలని కూడా నిశ్చయించుకుందాము. దేవునితో సమాధానపడుట అంటే దేవుని ఆత్మతో మన ఆత్మ కలవాలి. ఇహలోకపరంగా మనము ఎవరితోనైనా సమాధానంగా లేకుంటే సమాధాన పరచుకోవాలంటే 'సారీ' చెప్పుకుంటాము, చేయి చేయి కలుపుకొని సమాధానపడతాము. కాని దేవునితో సంబంధం మనలోని ఆత్మకే వుంటుంది. కాబట్టి ఆయనతో మన ఆత్మ కలిసినప్పుడే అట్టి సమాధానము కలుగుతుంది.

రెండవ కొరింథీ. 5:17, 6:2 వరకు చదువుకుందాము. "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్త వాయెను; సమస్తమును దేవుని వలననైనవి; ఆయన మనలను క్రీస్తు ద్వారా తనతో సమాధాన పరచుకొని, ఆ సమాధానపరచు పరిచర్యను మాకు అనుగ్రహించెను. అదేమనగా, దేవుడు వారి అపరాధములను వారి మీద మోపక, క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచు కొనుచు, ఆ సమాధాన వాక్యమును మాకు అప్పగించెను. కావున దేవుడు మా ద్వారా వేడుకొనినట్లు మేము క్రీస్తుకు రాయబారులమై – దేవునితో సమాధానపడుడని క్రీస్తు పక్షముగా మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాము. ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను. కాగా మేమాయన తోడి పనివారమై మీరు పొందిన దేవుని కృపను వ్యర్థము చేసి కొనవద్దని మిమ్మును వేడుకొనుచున్నాను. అనుకూల సమయమందు నీ మొరనాలకించితిని; రక్షణ దినమందు నిన్ను ఆదుకొంటిని అని ఆయన చెప్పుచున్నాడు గదా! ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము".

దేవుడు క్రీస్తు ద్వారా మనతో సమాధానపరచు కొన్నాడు అని పౌలు భక్తుడు మనకు చెప్తున్నాడు. మనకు అసలు దేవునితో సమాధానము లేకపోవడము ఎప్పుడు, ఎందుకు కలిగింది అన్నదానికి జవాబు కావాలంటే మనము ఆది. 2:16,17 వచనాలు చూచినట్లయితే దేవుడు ఒక చెట్టు ఫలములను తినవద్దు, అది తిను దినమున నిశ్చయముగా నీవు చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను అని చెప్తున్నాడు. కాని తరువాతి అధ్యాయంలో ఆదాము, హవ్వ సాతాను ద్వారా ప్రోత్సహింపబడి ఆ ఫలము తినుట చూస్తున్నాము. కాని ఆదాము చావలేదు గదా. ఇక్కడ చావడము అంటే శారీరకమైన చావు కాదు గాని దేవుని నుండి ఆత్మలో వేరుపరచబడటం. ఆ వేరుపరచబడటాన్ని తీసివేసి మళ్ళీ తనతో సమాధానపరచుకొనుటకే దేవుడు తన ఏకైక కుమారుణ్ణి ఈ లోకమునకు పంపాడు. యేసు ప్రభువు ఒక వంతెనలాగా మానవున్ని, దేవున్ని కలిపాడు. మన ఆత్మ దేవుని ఆత్మతో కలిసినపుడు మనము నూతన సృష్టి; పాతవి గతించెను; ఇదిగో క్రొత్తవాయెను. మనము దేవుని స్వరూపములోనికి తేబడుతాము. ఒక కంప్యూటర్‌లో పాత డేటా అంతా తీసివేసి క్రొత్త డేటా ఎక్కించినట్లు మనము రూపాంతరము పొందుతాము. క్రొత్త ఆలోచనలు, క్రొత్త జీవితము వస్తాయి. ఒక లార్వా నుండి సీతాకోకచిలుక వచ్చినట్లుగా మనము క్రొత్త మనుష్యులుగా మారిపోతాము.

ఈ విధంగా సమాధానపరచబడినవారు క్రీస్తు రాయబారులవుతాము అని పౌలు చెప్తున్నాడు. ఒక రాయబారి బాధ్యతలు చూద్దాము :

1) రాయబారి తను ఉన్న అన్యదేశముతో ఎట్టి సంబంధాలు లేకుండా తన స్వదేశ సహాయకుడిగా, తన స్వదేశ పనులు మాత్రమే చేయవలెను.

2) రాయబారి ఎప్పుడూ తన స్వదేశ అభిప్రాయములు మాత్రమే చెప్పువాడిగా ఉండవలెను.

3) విదేశములో నియమింపబడిన రాయబారి తన స్వదేశ గొప్పతనమునే స్థాపించవలెను.

మనము దేవునితో సమాధానము కలిగియున్నప్పుడు దేవునికి రాయబారులవుతాము అని వ్రాయబడి వుంది కదా! అంటే దేవుని రాజ్య సభ్యత్వము పొంది దేవుని రాజ్యము నుండి రాయబారులుగా ఈ లోకంలోకి వస్తామన్నమాట. పైన పేర్కొన బడిన రాయబారి బాధ్యతలన్నీ మనము చేయాలి. అప్పుడు మనము దేవుడు ఈ లోకములో ఉన్నప్పుడు చేసిన పనులన్నీ చేయాలి. యేసుప్రభువు చెప్పిన ప్రకారము ఆయనను మనలో కలిగి ఉన్నప్పుడు ఆయనకంటే ఎక్కువ అద్భుతాలు చేయ గలము. పరలోక రాయబారులుగా ఉన్నప్పుడు మనము పరలోకపు విలువలతో జీవించాలి. యేసుప్రభువులాటి అధికారము మనకు కూడా ఇవ్వబడుతుంది. అమెరికా దేశపు రాయబారి మనదేశంలో ఉన్నప్పుడు ఆయన జీవించే విలువ లన్నీ అంతా అమెరికన్ల లాగే వుంటుంది. ఆయన కార్యాలయ ఖర్చులు, స్వంత ఖర్చులు అన్నీ అమెరికా ప్రభుత్వమే భరి స్తుంది. ఆ రాయబారి బీదస్థితిలో ఉన్నాడనుకోండి అది అమె రికా ప్రభుత్వానికే అవమానము. అదేవిధంగా మనము దేవుని రాజ్యానికి రాయబారులు అయినప్పుడు మనకు కూడా ఏ లోటూ ఉండకూడదు. దేవుడే మన అవసరాలన్నిటినీ చూచూ కుంటాడు.

మనము దేవునితో సమాధానపరచబడినప్పటి నుండీ, అంటే మనము రాజాధిరాజైన ఆ క్రీస్తును స్వీకరించినప్పటి నుండి మనకు పరలోక రాజ్య సభ్యత్వము వస్తుంది. ఆయన రాజ్యము "శాశ్వత రాజ్యము". అందులో ప్రేమ, జీవము, సత్యము, న్యాయము, సంతోషము నిండి వుంటుంది. ఇహలోక రాజ్యములో వున్న మానవులను రక్షణలోనికి నడిపించుట; శాంతి సమాధానాలు నెలకొల్పుట; బీదరికాన్ని తొలగించుట, ఆకలిగొన్న వారికి ఆకలి తీర్చుట; రోగులను స్వస్థపరచుట, బందింపబడిన వారికి విడుదల కలుగ జేయుట అన్నవి దేవుని రాజ్య బాధ్యత. మనము రాయబారులము కాబట్టి ఆ పనులు, బాధ్యతలు అన్నీ మనవి అవుతాయి.

ఈ పనులు చేయుటకై మనకు దేవుడు పరిశుద్ధాత్మ ద్వారా వరములు, ఫలము ఇస్తాడు. ఈ వరాలు, ఫలము ఏంటో మనము చూద్దాం. మనం దేవునికి సంపూర్తిగా సమర్పించుకు న్నప్పుడు మనలో ఆత్మఫలము కనబడుతుంది. ఆత్మఫలములు మొత్తము తొమ్మిది ఉన్నాయి కాని అది బహు వచనముగా కాక ఏకవచనములో ఫలము అని కనబడుతుంది. ఎందుకంటే మొత్తం తొమ్మిది లక్షణాలు ఉంటేనేగాని అది పూర్తి అయినట్లు కనబడదు. ఈ తొమ్మిది కృపలు పూర్తిగా అలవరచుకుంటేనే గాని క్రైస్తవుడు పరిపూర్ణుడు కాలేడు. గలతి. 5:22లో ఆత్మఫలము ఏది అని తెలుపబడింది. 'ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళు త్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్ర హము. ఈ లక్షణాలన్ని యేసుప్రభువులో చూస్తున్నాము. మనము దేవునితో సమాధానపరచబడినప్పుడు ఈ ఆత్మ ఫలము మనకు అబ్బుతుంది. ఈ ఆత్మఫలము యొక్క ఉపయోగం ఏమంటే మన ఫలము ఇతరులకు ఉపయోగపడా లని దేవుని ఉద్దేశము. మనము ఫలవంతముగా ఉండి ఇతరు లను దేవుని దగ్గరికి తీసుకొని రాగలిగినపుడే అది ప్రయోజన కరంగా వుంటుంది.

ఆత్మ వరాలంటే ఏమిటో మనం 1కొరింథీ. 12:8-10 లో చూద్దాము : 'బుద్ధివాక్యము, జ్ఞానవాక్యము, విశ్వాసము, స్వస్థపరచు వరము, అద్భుతకార్యమలను చేయు శక్తి, ప్రవచన వరము, ఆత్మల వివేచన, నానావిధ భాషలు, భాషల అర్థము చెప్పు శక్తియు అని చెప్పబడి వుంది. ఇంకా కొన్ని వరాలు కూడా బైబిలులో చెప్పబడివున్నాయి. వాక్య పరిచర్య, సంఘకాపరిగా ఉండుట, హెచ్చరించే వరము, పంచిపెట్టే వరము, కరుణించే వరము లాంటివి. ఈ వరాలన్నీ అందరి ప్రయోజనము కొరకు ఇవ్వబడియున్నవి. ఈ వరాలతో మనము అందరినీ రక్షణలోనికి నడిపించాలి.

మనం దేవునితో సమాధానపడి నూతనత్వం సంతరించు కున్నప్పుడు మనకు కొన్ని వరాలు మన అవసరాన్ని బట్టి దేవుడు అనుగ్రహిస్తాడు. ఇవి మనము తప్పక ఉపయోగిం చాలి. రోమా 12:2లో వ్రాయబడిన ప్రకారము "ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొను నట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి". ఈ రూపాంతరము పొందిన తర్వాత మనము దేవునితో సమాధానపరచబడి దేవుని రాజ్యానికి రాయబారు లుగా ఉంటూ కృప ఫలము, వరములను పొంది దేవుని మహిమార్థము జీవిస్తాము. ఈ విధంగా మీరందరూ జీవించాలని దేవుని ప్రార్థిస్తున్నాను. ఆమేన్.

**- బి. విమలారెడ్డి, హైదరాబాద్**

# అమృతధార

**(కొండెపోగు బి. డెవిడ్ లివింగ్‌స్టన్)**

"నేను నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యకరమైన సంగతులను చూచున్నట్లు నా కన్నులు తెరువుము" కీర్తన 119:18.

బైబిల్ గ్రంథంలో అమూల్యమైన నిగూఢమైన సంగతులెన్నో ఉన్నాయి. ఇదొక మహత్తరమైన గని. దీన్ని త్రవ్వే కొలదీ ఎన్నో రత్నాల రాసులు బయటపడతాయి. బైబిల్ ఒక చారిత్రక గ్రంథం. ఒక విజ్ఞాన శాస్త్రం, ఒక మహాకావ్యం, ఒక భవిష్యవాణి, అన్నిటినీ మినిచి ఇది మానవాళికి దేవుడిచ్చిన "మార్గదీపిక".

ఇటువంటి శ్రేష్టగ్రంథ రాజమైన బైబిలులో ఒక మార్మికమైన నదిని గురించిన ప్రస్తావన వుంది. "ఒక నది కలదు. దాని కాలువలు దేవుని పట్టణమును సర్వోన్నతుని మందిరపు పరిశుద్ధ స్థలమును సంతోషపరచుచున్నవి" అంటూ కోరహు కుమారులు గానం చేశారు (కీర్తన 46:4).

ఈ మార్మికమైన నది బైబిల్ అంతటా దర్శనమిస్తుంది. ఈ నది జగద్రక్షకుడైన యేసుస్వామికి సాదృశ్యంగా ఉంది. ఈ అమృతధార పరలోక పట్టణం నుండి నరలోకానికి జాలువారింది. రండి! ఈ అమృతధారలో తరిద్దాం.

పొర్లి పొర్లి పారుతుంది, కరుణానిది! కల్వరిలో స్వామి రుధిరమది పొర్లి... పొర్లి... అంటూ పారవశ్యంగా కళ్ళు మూసుకుని నగుమోముతో మా జోసఫ్ మామ పాడుతుంటే ఆ గాన మాధుర్యంలో నేను మునకలు వేసేవాణ్ణి.

అవును – ఒక కరుణానది గురించి, ఒక అనాది అమృతధార గురించి మీకు సవిస్తారంగా చెప్పాలని వుంది.

**ఈ అమృతధార ఏమిటో తెలుసా?**

ఇది అమరత్వాన్ని కలిగించే అనంత ప్రవాహం. ఈ జీవజలధారలో ఎవరు మునిగి లేస్తారు వారు జీవన్ముక్తులౌతారు. వారి పాత బ్రతుకు పాతిపెట్టబడి నూతనంగా జన్మించిన శిశువుల్లా ఆ అమృతధార నుండి వెలుపలికి వస్తారు. వారే రెండవసారి జన్మించినవారు. వారే ద్విజులు.

ఆదియందు దేవుడు ఆదాము, హవ్వల్ని సృజించి, ఏదేను అనే దివ్యవనంలో ఉంచాడు. ఈ ఏదేను తోట బహుశా యూఫ్రటీసు టైగ్రీస్ నదుల మధ్యనున్న మెసపుటోమియా ప్రాంతంలో ఎక్కడో ఒక చోట ఉండ వచ్చునని బైబిల్ పండితుల భావన.

ఏదేను తోట నుండి ఒక అమృతధారను దేవుడు ప్రవహింపజేశాడు. అంత క్రితం భూమి మీద ఏ నదీ లేదు. ఆ నది నాలుగు పాయలైంది. అది స్వచ్ఛ స్ఫటిక జలధార, తోను తడిపేది. చెట్లకు పశుపక్ష్యాదులకు సేదతీర్చేది. ప్రాణాన్ని పరిపుష్టం చేసేది.

ఆదాము, హవ్వల పాప ఫలితంగా భూమి శపింపబడినపుడు ఈ పుణ్య నది ఈ అమృతధార ఒక సాదా సీదా నీటి ప్రవాహంగా మారిపోయింది. తన మహత్తును కోల్పోయింది. శపిత భూమితో అంటుకట్టబడింది.

అంతకుముందు ఈ అమృతధార జీవవృక్షాలకు మంచిచెడ్డల తెలివినిచ్చే వృక్షానికి కూడా నీరు అందించేది.

దీని గురించి బైబిల్ నుండి పరిశీలిద్దాం ".... ఆ తోటను తడుపుటకు ఏదేనులో నుండి ఒక నది బయలుదేరి అక్కడ నుండి చీలిపోయి నాలుగు శాఖలైంది" (ఆది.2:10). ఎందుకు ఈ నది నాలుగు శాఖలైంది? ఎందుకంటే ఈ ధార భూమి నలుదిక్కులకూ ప్రవహించాలనేది దేవుడి ఉద్దేశ్యం. అయితే ఇది ఇపుడు భూమి నాలుగు దిక్కులకూ పారుతూనే ఉన్నది. అదెలాగో ముందు ముందు చూడబోతాం.

ఇదే అమృతధార బైబిల్‌లోని చివరి గ్రంథమైన ప్రకటన గ్రంథంలోనూ దర్శనమిస్తుంది. "మరియు స్ఫటికమువలె మెరయునట్టి జీవజలముల నది దేవుని యొక్కయు, గొర్రెపిల్ల యొక్కయు సింహాసనము నొద్దనుండి ఆ పట్టణపు రాజవీధి మధ్యను (పరమ యెరూషలేము) ప్రవహించుట ఆ దూత నాకు చూపెను. ఆ నది యొక్క ఈవలను ఆవలను జీవవృక్షముండెను. అది నెల నెలకు ఫలించుచు పండ్రెండు కాపులు కాయును" ప్రకటన 22:1-2. ప్రకటన గ్రంథంలో పేర్కొనబడిన ఈ అమృతధార గొర్రెపిల్ల అయిన క్రీస్తు సింహాసనము నుండి పరమ యెరూషలేములో ప్రవహిస్తూ ఉంది.

ఇది యుగములకు పూర్వమే వధించబడిన గొర్రెపిల్ల అయిన క్రీస్తు రుధిర ధారకు సాదృశ్యం. "నా శరీరము తిని నా రక్తము త్రాగువాడే నిత్యజీవము గలవాడు. అంత్యదినమున నేను వానిని లేపుదును. నా శరీరము నిజమైన పానమునై యున్నది. నా శరీరము తిని నా రక్తము త్రాగువాడు

నాయందును నేను వానియందుని నిలిచియుందును" (యోహాను 6:54,55) అని జగద్రక్షుడైన యేసుప్రభువు వాక్రుచ్చారు.

ఇక్కడ ప్రభువు శరీరము, రక్తము భౌతిక పదార్థాలు కావు. దేవుడు ఆత్మ అంటుంది బైబిలు. భౌతికమైన దేహం బ్రతికి ఉండడానికి, పరిపూర్ణ వికాసం పొందటానికి , తేజోవంతం కావడానికి పుష్టికరమైన ఆహారం, నీరు కావాలి. అలాగే ఆత్మబలం పొందడానికి ఏదేనులో మృతతుల్యంగా మారిపోయిన ఆత్మదీపం దేదీప్యమానంగా ప్రకాశించడానికి అంతరంగ పురుషుడు వర్ధిల్లడానికి ఆత్మసంబంధమైన ఆహారం, పానీయం కావాలి.

యేసుప్రభువు ఈ లోకానికి తనకు తాను జీవాహారంగా ప్రత్యక్షపరచుకున్నాడు. (యోహాను 6:35-51) ఆయనే జీవాహారం, జీవజలం. ఆత్మ దాహాన్ని తీర్చే అమృతధార. శపించబడిన ఈ నేలపై ప్రవహించే నీరే మానవుడికి దప్పిక తీర్చి, ఉల్లాసాన్ని కల్గించి సేదతీర్చేదిగా ఉండగా పరలోకం నుండి నేలకు జాలువారిన ఈ అమృత ప్రవాహం మరెంత ఆశీర్వాదకరం!

**నీరు-స్నానం :**

నీరు దప్పిక తీర్చడమే కాక మనిషి మాలిన్యాన్ని కడుగుతుంది. మనిషి స్నాన ప్రక్రియ ద్వారా తనను తాను శుద్ధీకరించుకుంటాడు. ఈ స్నానానికి వేల ఏళ్ళనాటి చరిత్ర వుంది. స్నానం వల్ల శరీరంపై చేరిన దుమ్ము, బాక్టీరియా తొలగిపోతాయి. మన చర్మం ఒక చిల్లుల జల్లెడలాంటిది. ఈ చర్మం అంతటా విశేష సంఖ్యలో స్వేద రంధ్రాలు వున్నాయి. వీటి ద్వారా నత్రజని సంబంధమైన వ్యర్థ పదార్థాలు చెమట రూపంలో విసర్జించబడతాయి. ఇలా జరగకపోతే అనేక ఆరోగ్యపరమైన చిక్కులు ఏర్పడతాయి. స్నాన సమయంలో శరీరమర్ధన వల్ల దుమ్ము ధూళితో మూసుకుపోయిన చర్మరంధ్రాలు చక్కగా తెరుచుకుంటాయి. జీవక్రియలు క్రమబద్ధం అవుతాయి. చర్మం కాంతివంతం అవుతుంది. అలసిపోయిన శరీరానికి విశ్రాంతి నిస్తుంది. శరీరానికి తేలికదనం, ఒక విధమైన తాజాదనపు అనుభూతి కలుగుతుంది. మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. శిరోభారం తొలగుతుంది. ఇదీ విజ్ఞానశాస్త్రం అందించే సమాచారం.

భౌతికమైన నీటి ప్రవాహంలో చేసే స్నానం ఇంత మేలు చేసేదిగా ఉంటే క్రీస్తు అనే జీవజలధార మరింకెంతో విశ్రాంతి ప్రదాయిని అని అనుకోవాలి కదా! అందుకే యేసుస్వామి అన్నాడు - "ప్రయాసపడి భారము మోసుకొనుచున్న సమస్తమైన వారలారా! నా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతిని కలుగజేతును" (మత్తయి 11:28). మానవుడికి అంటిన పాపపు భారం, శాపపు భారం చర్మానికి అంటుకున్న దుమ్ము, ధూళి కాదు, అది ఏ నీటి ప్రవాహంలో మునిగినా తొలగిపోదు. అది ఆత్మకు అంటిన పంకిలం. అందుకే మనం మునగాల్సింది నీళ్ళలో కాదు, కన్నీళ్ళలో కాదు. అనాదికాలం నుండి అనంతంగా ప్రవహిస్తున్న జీవజల నదియైన క్రీస్తులో.

బైబిల్ ఇలా అంటుంది. నీళ్ళ ద్వారాను, రక్తము ద్వారాను వచ్చినవాడు ఈయనే అనగా యేసుక్రీస్తే. ఈయన నీళ్ళతో మాత్రమేకాక నీళ్ళతోనూ, రక్తముతోనూ వచ్చెను (యోహాను 5:6-8). నీళ్ళు బాహ్య మాలిన్యాన్ని కడిగివేస్తాయి. రక్తం చిందించడం ద్వారా జరిగే బలికార్యం అంతర్యపు పాప పంకిలాన్ని కడిగి శుద్ధ చేస్తుంది. యేసుస్వామి మనల్ని బాహ్యాంతరాల్లో శుద్ధి చేస్తాడు. భక్తుడికి బాహ్యశుద్ధి, హృదయశుద్ధి రెండు అవశ్యకాలే. అందుకే యేసుస్వామివారు నీళ్ళతోను, రక్తంతోను వచ్చాడు. యేసుప్రభువు వారు అనే ఈ మార్మికమైన జలధార. బైబిల్ అంతటా సాక్షాత్కరిస్తూనే ఉంది.


## గొప్ప ఆహ్వానము

ప్రతినెల రెండవ శుక్రవారము రాత్రి 10 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు

**సంపూర్ణ రాత్రి ప్రార్థన జరుగును.**

స్థలము : యు.సి.యల్.ఐ. చర్చి, బాప్టిస్ట్ ప్రెయర్ హాల్ దగ్గర, ప్రార్థన కొండ (ఒంగోలు కొండ), కొండమిట్ట, ఒంగోలు - 523 001

మీ వ్యక్తిగత, కుటుంబ అవసరతల కొరకు, అన్ని సమస్యల కొరకు ప్రార్థనలు చేయబడును

రండి కలిసి ప్రభుని ఆరాధించెదము.

సాక్ష్యము

# వైస్ ఛాన్సలర్ మద్దెల ఏబెలు

2

1935లో వచ్చిన మంచి మార్కులతో ఆయనకు స్కాలర్‌షిప్ లభించింది. 1941 వరకు హైస్కూలు విద్యలో అత్యున్నతమైన మార్కులు సంపాదించారు. యస్.యస్.యల్.సి.లో మొదటి ర్యాంకు సాధించాడు. లెక్కల పరీక్షలో ఉత్తమశ్రేణి సంపాదించాడు. డోర్నకల్ దయాసిస్ వారు నిర్వహించిన బైబిల్ పరీక్ష వ్రాసి ప్రథమ శ్రేణిలో ర్యాంకు సాధించారు. ఏబెల్‌గారికి చిన్నతనము నుండి నాయకత్వ లక్షణాలున్నాయి. విద్యార్థి నాయకునిగా గుర్తింపు పొందాడు. తను విశ్వసించిన దానిని ధైర్యముగా ఆచరించేవారు. స్కూలు లీడరుగా, క్వయరు లీడరుగా, ఆల్టర్ బాయ్‌గాను ఆయనను సంఘము గుర్తించింది.

1941లో హైస్కూలు విద్య ముగిసిన తర్వాత ఆయనను దేవుని సేవకునిగా చేయాలని తల్లి ఆకాంక్షించింది. అందుకై ఆయనను యస్.జి.టి.టి.సి. చేయవలసి యున్నది. దీనికి ముందు ఒక సంవత్సరము అన్‌ట్రెయిన్ టీచరుగా పల్లెటూరి మిషన్ బడిలో పని చేయవలసి యుండెను. కనుక పెద్ద ఒంగలి బడిలో పనిచేసిరి. తర్వాత కడపలో 1942లో లండన్ మిషన్ వారి స్కూల్లో రెండు సంవత్సరాలు ట్రైనింగ్ పూర్తి చేశాడు.

సెలవులలో ఆఫీసులోనే పూర్తి సమయం గడుప సాగారు. తన అన్నకు ముత్యాలపాడు డీనరీ ఛైర్మన్‌తో కొన్ని విషయాల్లో అభిప్రాయ బేధాలున్నందున్న ఆయన అధికారం క్రింద తన తమ్ముని పనిచేయ నిష్టపడలేదు. 1944లో గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో, స్కాలర్‌షిప్‌తో ఇంటర్‌లో చేరారు. 1946లో జరిగిన పరీక్షలలో మొదటి శ్రేణిలో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 78 శాతం మార్కులు సాధించారు. విశ్వవిద్యాలయములో ఏబెల్‌గారు తన పేరు నిలబెట్టుకున్నారు.

గుంటూరు ఏ.సి. కాలేజిలో ఇంటర్ మార్కులకు మద్రాసు గవర్నర్ పేరు మీద లార్డు గోషన్ స్కాలర్‌షిప్ ఇవ్వబడింది. నాడు ఆంధ్ర కూడా మద్రాసు రాష్ట్రంలో ఒక భాగమే. 1948లో బి.ఏ.లో ఎకనమిక్స్ గ్రూపులో చేరారు. హాస్టల్ ప్రిఫెక్ట్ అయ్యారు. జార్జి థామస్ యన్. ఐజక్‌గారలు లెక్టరర్స్‌గా ఏబెల్‌గారిని బహుగా ప్రేమించారు. తర్వాత ఒంగిలిలో ఏబెల్‌గారి వివాహానికి హాజరయ్యారు. అది అయిన తర్వాత తన రెండో అన్న వివాహమైన తర్వాత బి.ఏ. ఆనర్సు చెయ్యాలనుకున్నారు. మద్రాసు తాంబరం వచ్చి క్రిస్టియన్ కాలేజిలో చేరారు. 1948లో పరీక్షలో ఫస్టు ర్యాంకులో పాసయ్యారు.

1950 సం॥లో మొదటి శ్రేణిలో యూనివర్సిటీ అంతటిలో వచ్చారు. అప్పుడే నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చస్ నాయకత్వము వహించారు. చరిత్ర విభాగములో విద్యార్థి ఛైర్మన్‌గాను, ఆంధ్రభాష రంజని సంస్థకు సెక్రటరీగాను ఉన్నాను. ది పొలిటికల్ ఫీచర్స్ బిహైండ్ జీసస్ క్రైస్ట్ అనే ఎస్సేస్ వ్రాశారు.

1950 జూన్ 21న తాంబరం చేరి హిస్టరీ విభాగంలో లెక్చరర్‌గా ఉద్యోగం ప్రారంభించారు. అయితే మొదటి సంవత్సరం ట్యూటర్‌గా పని చేయమని ఉంది. 1951 నుండి 1959 వరకు లెక్చరర్‌గా పనిచేశారు.

మద్రాసు క్రిస్టియన్ కాళాశాల అధికారులు ఏబెల్ గారిని పి.హెచ్‌డి. కోర్సును చేయుటకు విదేశాలకు పంపించుటకు నిశ్చయించారు. స్కాలర్‌షిప్ కొరకు ధరఖాస్తు చేశారు. ఇందుకొరకు పెద్ద పోటీ యుండెను. అందుకై ఇంటర్వ్యూలో ఏబెల్‌గారి ప్రతిభ చూసి ఆశ్చర్యపోయారు. వెయ్యిమందిలో నలుగురిని సెలక్టు చేశారు. వారిలో ఏబెల్ గారు ఒకరు. 1959 జూలై 11న బొంబాయి వెళ్ళి అక్కడ ఓడ ఎక్కి అమెరికా చేరారు.

అక్కడికి వెళ్ళిన తరువాత "యూనివర్సిటీస్ ఆఫ్ కేన్సాస్"లో సెప్టెంబరు మొదటి వారం వరకు ఓరియంటేషన్ తీసుకొని తర్వాత లాస్‌ఏంజల్సు వెళ్ళి అక్కడ ఉన్న యూనివర్సిటీలో పి.హెచ్‌డి. రిసెర్చి స్కాలర్‌గా సెప్టెంబర్‌లో ప్రారంభించారు. రెండు సంవత్సరాలులోనే పి.హెచ్‌డి. సంపాదించి స్వదేశం వచ్చారు. అప్పుడు కూడ డాక్టర్ దేవనేషన్‌గారే ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఏబెల్‌గారిని కేవలం లెక్చరర్‌గానే ఉండకూడదని పొలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అనే క్రొత్త డిపార్టుమెంటు ప్రారంభించి ఏబెల్‌గారిని హెడ్ ప్రొఫసర్ ఆఫ్ ది డిపార్టుమెంటుగా నియమించారు. ఈ పదవిలో రెండు సంవత్సరాలు కార్యభారము నిర్వర్తించి తిరిగి

1976లో డీన్‌గా నియమితులైనారు. ఆ తర్వాత 1978లో ప్రిన్సిపాల్‌గా నియమితులై 1982 మే నెలలో రిటైరైనారు.

ఇటువంటి పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ ఈశ్వరరెడ్డిగారు 1981 ఏప్రిల్‌లో ఏదో పనిమీద ఏబెల్‌గారి దగ్గరికి వచ్చి రిటైరైన తర్వాత ఏమి చేస్తారు అని ఏబెల్‌గారిని అడిగాడు. దేవుని పని చేస్తానని చెప్పారు ఏబెల్‌గారు. మీ బయోడేటా ఇవ్వండి అని ఏబెల్‌గారి బయోడేటా తీసుకొని వెళ్ళారు.

1981 జూలై 22న ఏబెల్‌గారు మధురైకి రైలులో ప్రయాణం చేస్తున్నప్పుడు ఫోను వచ్చింది. ఆ ఫోన్ మద్రాసు 'హిందూ పేపర్' వారిది. వారు ఫోనులో 'మీరు శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా అపాయింట్ అయ్యారు. మీ ఫోటో ఇవ్వండి' అని అడిగారు అప్పుడు ఆంధ్రాలో కె.సి.అబ్రాహంగారు గవర్నరుగాను అంజయ్య గారు సి.యం.గాను ఉన్నారు. ఈశ్వర్‌రెడ్డిగారు విమాన టిక్కెట్టు పంపించారు. 1981 ఆగస్టు 23న శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీకి వైస్‌ఛాన్సలర్‌గా చార్జి తీసుకొని అనంతపురంలో కాపురం పెట్టారు. ఫస్ట్ టర్మ్ వైస్ ఛాన్సలర్ పూర్తి అయిన తర్వాత మద్రాసు వచ్చాక నందమూరి తారక రామారావుగారు ముఖ్యమంత్రి అయిన తర్వాత 1984 డిశెంబరు 11న ఉదయం ఆలిండియా రేడియోలో ఏబెల్ గారిని రెండవసారి శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా నియమించినట్లు ఏబెల్‌గారు విన్నారు. 1987లో రెండవ టర్మ్ పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా అపాయింటు అయ్యారు. 1987-88 హైదరాబాద్‌లో కాపురం పెట్టారు.


1941లో టీచర్‌గా పనిచేసేటప్పుడు చింతలచెరువులో నుండి కట్టుడు సున్నంతో ఏబెల్‌గారు ఎడ్లబండి తోలుతుంటే నరసింహారెడ్డి అనే రైతు వచ్చి బండిని ఆపి ఎడ్లను విప్పాడు. ఏబెల్‌గారు చాగలమర్రి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించి గెలిచాడు.

అదే సంవత్సరం గంగమ్మ జాతర జరిగేటప్పుడు నిమ్మ జాతివారు దున్నను నరకాలి. మాలపెద్ద వచ్చి దున్నకు పూజచేసి బయటకు తీసుకెళ్ళి ఖడ్గం నోటిలో పెట్టుకొని జోన్నకూడు పట్టుకొని మధ్యరాత్రి ఊరి చుట్టూ తిరగాలి. కాని ఏబెల్‌గారు అందుకు వ్యతిరేకంగా పోరాడి ఆ పద్ధతి నిలుపు చేయించాడు. అందుకుగాను మాలల ఇండ్లు తగుల బెట్టారు. నంద్యాల సబ్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసువేసి గెలిచాడు. ఈ విధంగా ఆది నుండి క్రైస్తవుల హక్కుల కొరకు ఏబెల్‌గారు పోరాడేవాడు.

వీరి క్రైస్తవ ఆధ్యాత్మిక ప్రసంగాలు మొదట రేడియో ద్వారా తర్వాత గ్రంథరూపములో వెలువడినవి. అవి 1. రిలిజియన్ అండ్ పాలిటిక్స్, 2. లైఫ్ ఇన్ క్రైస్ట్, 3. ఇండియా ఎ న్యూ వరల్డ్ ఆర్డర్.

ఇప్పుడు వారు ఒక ట్రస్టును ఏర్పాటు చేసి అనాధలకు ఆశ్రయం కల్పించాడు. పేద విద్యార్ధుల కొరకు ఒక కమ్యూనిటి కాలేజి నడిపించ ఏర్పాట్లు చేస్తున్నారు. వీరు సాధించిన అకడమిక్ డిస్టింక్షన్‌లు అయిదు. ప్రొఫెషనల్ అనుభవాలు పదిహేను. విదేశాలలో, స్వదేశములోను హాజరైన సెమినార్లు, కాన్ఫరెన్సులు పదకొండు. అదర్ ప్రొఫెషనల్ యాక్టివిటీస్ పధ్నాలుగు, పబ్లిక్ మరియు సోషల్ లైఫ్‌లో చేసిన సేవలు ముప్పైనాలుగు

భారతదేశములో మూడు పత్రికలకు 1978 నుండి 2003 వరకు ఎడిటర్‌గా ఉన్నారు. వీరికి ఆరు అవార్డులు వచ్చాయి. నేడు హన్నాకృప పత్రికకు ప్రియమైన పాఠకులుగా ఉన్నారు.



## ఎస్.యం.ఎస్. (వాయిస్/టెక్స్ట్) పరిచర్య

**ఎవరైనా ప్రతిరోజు దేవుని వాక్యము (టెక్స్ట్) ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో 9908822365 నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు సహకారము అందించుచున్న వారందరికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.



సాక్ష్యము

# కీ.శే. రెబ్బా ప్రసాదరావు

4

ఆ తరువాత మూడు సంవత్సరములు మానక వారి కోసం ప్రార్థిస్తూ స్టూవర్టుపురంను దర్శించి అనేకులను ప్రభువులోనికి నడిపించిరి. మూడు సంవత్సరాలు వారిని బలపరచిన మీదట మద్రాసు నుండి దైవజనులైన దానియేలు గారిని స్టూవర్టుపురంలో సభలకు ఆహ్వానించిరి. అది మొదలుకొని నేటి వరకు స్టూవర్టుపురంలో సభలు గంభీరంగా జరుగుచున్నవని చెప్పుటలో అతిశయోక్తిలేదు.

1950లో విజయవాడ, పనుమూడి, సింగుపాలెం, దాసరిపాలెం, నల్లూరు మొదలైన ప్రదేశములలో ఉజ్జీవ కూటములకు దైవజనులు ప్రసాదరావు హాజరైరి

వణుకూరులో వనజాక్షమ్మ అనే స్త్రీ గుండెనొప్పితో కూటములకు వచ్చెను. ఆమె వాక్యము వినుచుండగా స్వస్థపరచబడినది. ఆమె అత్తగారి గ్రామమైన అనంతవరము వచ్చి ప్రసాదరావును తమ గ్రామమునకు ఆహ్వానించిరి.

వనజాక్షమ్మతో ప్రభువు ఈ విధముగా మాట్లాడెను. నీవు దాచియుంచిన సరస్వతి పింగాణీ బొమ్మలు పెట్టె అడుగు నుండి తెచ్చి అయ్యగారి ముందు పగుటగొట్టుము అని వినిపించగా ఆమె ఆ విగ్రహములను తెచ్చి అయ్యగారి ముందు పగులగొట్టిరి. హిందువుల మధ్య ప్రసాదరావును ప్రభువు బహుబలముగా వాడుకొనుచుండెను. అనంతవరములో హిందువులు, విగ్రహారాధికులైన వారనేకులు మారుమనస్సు పొందిరి.

1952 ఫిబ్రవరి నెలలో అనంతవరములో విశ్వాసులకు కూటములు ఏర్పాటు చేయబడినవి. బొల్లెద్దు జాన్, అంబటి ఇస్సాకు, హేబెల్, జెట్టి ప్రకాసం, ప్రసాదరావుగార్లు ఆ కూటములకు సేవకులుగా పిలువబడిరి. ఈలాంటి ఆత్మీయ కూడికలు ఎన్నడూ జరుగలేదు. ఈ మీటింగులకు ముందు ప్రసాదరావు 14 దినములు ఉపవాసముండి ప్రార్థించిరి. అనేకమంది హిందువులు మార్చబడిరి. అప్పారావు ఆయన భార్య అప్పమ్మ మార్చబడెను. అనేక మంది హిందువులను క్రైస్తవులుగా మారుస్తున్నారని ప్రసాదరావుపై ఒక యౌవనస్థుడు దుర్భాషలాడుచు, కొట్టుటకు చెయ్యి ఎత్తెను. ప్రసాదరావు మౌనముగా అలాగే నిలుచుండిరి. అయితే ఆ యౌవనస్థుడు ఎత్తిన చెయ్యి దింప వీలుగాకుండా అలాగే ఆగిపోయింది. చివరికి గడగడ వణకుచు వెనక్కి తిరిగిపోయాడు. ఆ దృశ్యమును చూచిన వారందరూ విభ్రాంతి నొంది దైవజనునిబట్టి దేవుని మహిమపర్చిరి.

అదే గ్రామమైన అనంతవరములో కుర్రా లక్ష్మీ నారాయణ ఆయన భార్య శ్రీకృష్ణమ్మ అనేక దేవుళ్ళను పూజించెడివారు. ఎంతమందిని ఆరాధించినా ఫలితంలేక ఆత్మశాంతి దొరుకక, మహ్మదీయ మతమును కూడా వెదకిరి. సాయిబాబాను ఆరాధించిరి. అక్కడ కూడా ఆత్మ శాంతి దొరకలేదు. వారి యింట్లో ముడుపులున్నవి. నాగేంద్రుడు అను పెద్ద తెల్ల త్రాచుపామును పాలుపోసి పెంచుచుండిరి. వారి యింటి నిండా పుట్టలున్నవి. అనేక దేవుళ్ళ పటములు కలవు అనేక విగ్రహములు యింట్లో వుండేవి. ఆ గ్రామములో రక్షించబడిన విశ్వాసుల ద్వారా ప్రసాదరావు లక్ష్మీనారాయణ యింటికి నడిపించబడిరి. కొంతమంది విశ్వాసులతో కలసి ఉపవాసముండి ఆ కుటుంబము నిమిత్తము ప్రార్థించుచుండిరి. మూడు దినములు ప్రసాదరావు వారికి సువార్త అందించిరి. క్రీస్తు ప్రభువు మన పాపముల నిమిత్తం ఈ లోకానికి వచ్చి, మనకు రావలసిన పాపశిక్ష ఆయన భరించి, మనకోసం సిలువ మరణం పొంది, తన అమూల్య రక్తాన్ని చిందించారని, ఆయన రక్తంలో కడుక్కుంటే మనకు శాంతి సమాధానాలనిస్తారని, క్రీస్తు సజీవుడైన దేవుడని, మరణం నుండి మృత్యుంజయుడై తిరిగి లేచాడని బోధిస్తుండగా దేవుని ఆత్మ ఆ భార్యభర్తల మీదికి వచ్చినది. ప్రసాదరావు పాము విషయమై బోధిస్తుండగా ఆ పాము కనబడింది. వెంటనే వారు పాలు పోసి ఆ పామును కొట్టిచంపిరి. ముడుపుల విషయం ప్రార్థించగా ముడుపులు ఎత్తికొనిపోయి కాల్వలో పారవేసిరి. పటములు తీసివేసిరి. ఇంటిలోని పుట్టలు తీసివేసిరి. విగ్రహములను కాల్వలో పారవేసిరి. పశ్చాత్తాపపడి తమ పాపములు ఒప్పుకొని ప్రార్థించి రక్షింపబడిరి. అదే సమయంలో రాఘవమ్మ అనే స్త్రీ కూడా యేసునందు విశ్వాసముంచి తన పాపములు ఒప్పుకొని, క్రీస్తు రక్తంలో కడుగబడి రక్షింపబడిరి.

# సువార్తలలోని యేసు కథ

ఆయన సువార్త దండయాత్రలో యూదయలో ఉండగా ఒక పరిసయ్యుడు ఆయనను పగటి విందునకు ఆహ్వానించాడు. బహుశా ఉదయం సమాజ మందిరములో ప్రార్ధనల యిన తర్వాత ఆ పరిసయ్యుడు యేసును తన ఇంటికి ఆహ్వానించియుంటాడు. యథార్థమైన హృదయములోనే ఆహ్వానించి యుండాలి. ప్రభువు అందుకు అంగీకరించి వెళ్ళాడు.

యూదులు భోజనశాలలో అర్ధగోళాకారంగా ఒక అడుగు ఎత్తుండే బల్ల ఉంటుంది. భోజనమునకు కూర్చుండే ముందు తమ కుడిచేతిని మాత్రము కడుగుకొని తర్వాత ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్కరికి ద్రాక్షారసముతో నింపబడిన పాత్ర ఇవ్వబడుతుంది. ఆ పాత్రలు ఖాళీ అయిన తరువాత వారి వారి స్థాయి అంటే హోదానుబట్టి విందు యజమానికి చేరువలో స్థానము ఇవ్వ బడుతుంది. అందరి కాళ్ళు గోడవైపుగా చాచి ఎడమచేతిని తలకు పోటీగా పెట్టి ఎడమ ప్రక్కగా పందు కొనినట్లుగా కూర్చుని కుడిచేత్తో భోజనం చేస్తారు. అందరి కాళ్ళు గోడవైపుకు చాచబడియుంటాయి.

తర్వాత ఒక పెద్ద పాత్రలో నీళ్ళుపోసి భోజనమునకు కూర్చున్న వారందరి యొద్దకు తీసికొని వచ్చినప్పుడు రెండు చేతులు అందులో ముంచి చేతులు కడుక్కుంటారు. భోజన బల్ల దగ్గరకు సమీపించేటప్పుడు మొదట తన కుడిచేతిని పాత్రలో ముంచి కడుక్కోకుండా యేసు లోనికి వెళ్ళి కూర్చున్నాడు. ఈ సంఘటనతో ఆహ్వానితులందరూ నివ్వెరపోయారు. యేసువంటి ఘనుడైన వక్త బోధకుడు భోజన నియములు పాటించలేదని ఆశ్చర్యపోయారు. ఆయన గలలియలో ఉన్నప్పుడు పెద్దల వంశపారంపర్యా చారములను త్రోసిపుచ్చాడు. మీ పరిసయ్యులు గన్నెల్ని, పళ్ళేల్ని వెలుపలి భాగం శుభ్ర చేస్తారు. కాని లోపల దురాశ, దుష్టత్వము నిండి వుంటాయి అన్నాడు. అయితే కొందరు ఏదో గొణుక్కుంటున్నారు. వెంటనే ఆయన –'మూర్ఖులారా, వెలుపలి భాగం సృష్టించిన వాడే లోపలిభాగం సృష్టించలేదా?' అని చుట్టూ చూచి మీరు 'మీరు దాచుకొన్న వాటిని పేదవాళ్ళకు దానం చెయ్యండి. అప్పుడు మీరు పూర్తిగా శుభ్రమవుతారు. మొదటిగా మీరు మీ తోటలో పండిన పుదీన సదాప మొదలగు కూరగాయల యొక్క పదవ వంతు దేవునికి ఇస్తారు. కాని న్యాయాన్ని, దేవుని ప్రేమను నిర్లక్ష్యం చేస్తున్నారు. కనుక మీకు శ్రమ. పదవవంతు ఇచ్చుట మానుకొనకుండా న్యాయాన్ని దేవుని ప్రేమను కూడ అలవరచుకోవలసి వుంది' అన్నాడు.

మరోవైపుకు చూచి ఉన్నతమైన స్థానములో కూర్చున్న వారితో 'మీరు సమాజమందిరాల్లో ఉన్నత స్థలాలలో కూర్చోవటానికి ప్రాకులాడుతారు. దారిలో వెళ్ళేటప్పుడు ప్రజలు మిమ్ములను గౌరవించాలని ఆశిస్తారు. కనుక మీకు శ్రమ తప్పదు' అని 'ప్రజలు, తమకు తెలియకుండానే త్రొక్కుతూ నడిచే సమాధులవంటి వారు మీరు. మీకు శ్రమ' అన్నాడు.

ధర్మశాస్త్రంలో ప్రావీణ్యత ఉన్న ఒక శాస్త్రి లేచి 'బోధకుడా, మీరు ఈ విధంగా మాట్లాడి మమ్మల్ని కూడా అవమానపరుస్తున్నారు' అన్నాడు. అందుకు యేసు 'ధర్మశాస్త్ర పండితులారా, మీరు ప్రజలపై వారు మోయలేనంత భారము వేస్తున్నారు. కాని వాటిని లేపటానికి మీరు ఒక్క వేలు కూడా కదల్చరు. కనుక మీకు శ్రమ. మీరు ప్రవక్తల కోసం సమాధులు కట్టిస్తారు. కాని మీ పూర్వీకులు వాళ్ళని చంపారు. కనుక మీకు శిక్ష తప్పదు. అంటే మీ పూర్వీకులు చేసిన దానిని మీరు అంగీకరించినట్లు నిరూపించుకుంటు న్నారన్నమాట. వారు ప్రవక్తలను చంపారు. వారికి మీరు సమాధులు కట్టిస్తున్నారన్నమాట'

'అందువల్ల దేవుడు దివ్యజ్ఞానంతో ఈ విధంగా చెప్పాడు నేను వాళ్ళకోసం ప్రవక్తల్ని అపొస్తలులను పంపుతాను. కొందర్ని వారు చంపుతారు. మిగతా వాళ్ళని హింసిస్తారు. అందువలన ప్రపంచం పుట్టిన నాటనుండి ప్రవక్తలు కార్చిన రక్తానికి ఈ తరం వారు బాధ్యులు. హేబెలు రక్తము మొదలుకొని ధూపవేదికకు మందిరానికి మధ్య చంపబడిన జెకర్యా హత్య వరకు వీళ్ళు బాధ్యులు'

'ఔను ఈ కాలం వాళ్ళు వీటికి బాధ్యులని నేను చెప్తున్నాను, ధర్మశాస్త్ర పండితులారా, జ్ఞానము యొక్క తాళం చెవి మీరు తీసుకున్నారు. దాని తలుపు తెరచి మీరు లోపలికి వెళ్ళలేరు. పైగా వెళ్తున్న వారిని అడ్డగిస్తారు. మీకు శిక్ష తప్పదు' అని యేసు అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

# వైఫల్యాలు చాలు నాకు

(పండిట్ నెహ్రూ సమకాలికుడు జయప్రకాశ్ నారాయణ)

ముండ్లతో నిండిన సాటి
యువ విప్లవకారుల మార్గం
ఈ విపుల జీవితానికి
వెయ్యింతలు సార్థక్యం

ఫలితం వైఫల్యాల మయం
విజయం ఎప్పుడు చేరువైనా
దాన్ని నా మార్గం నుండి నెట్టివేశాను
ఇది మూర్ఖత్వమా? కాదు కాదు

వైఫల్యానికి - విజయానికి నా
నిర్వచనాలు భిన్నమైనవి
విప్లవ ప్రాథిపతకం - పరిశోదనము
ఇతర మార్గాలను - ఇతర ప్రమాణాలను
అనుసరించాను

పదవీ పరిత్యాగం - పునర్ణిర్మానం
పోరాటం సంపూర్ణ విప్లవం
విప్లవాన్వేషణ - అంగలు
ప్రపంచం దాన్ని వైఫల్యం అనవచ్చు
చర్యలు అనంతం - గమ్యం బహుదూరం
మార్గమధ్యంలో ఆగలేను
మార్గం ఎంత కరినమైనా సరే

నాకు వ్యక్తిగత వాంఛలు లేవు
అవన్ని దైవార్పితాలు
వైఫల్యాలు చాలు నాకు

(1976 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురణ)


## కొడవటికంటి రచనలు





## చందా వివరములు

హన్నాకృప పత్రిక ప్రతినెల 1వ తేదీన ఒంగోలులో పోస్టు చేయబడుతుంది. పత్రికకు వచ్చే సహాయము ప్రతి రూపాయిని మేము ప్రతినెలా పత్రికలో ప్రచురిస్తున్నాము. ఆ పట్టికను పరిశీలిస్తే పాఠకులైన చందాదారుల వలన ఈ పత్రిక నడిపించబడుట లేదని, ప్రభువును ప్రేమించిన బిడ్డలు ప్రభువుచే ప్రేరేపించబడి ఆర్థిక సహాయం చేస్తున్న వారి ద్వారా మాత్రమే ఈ పత్రిక నడిపించబడుతుందని తెలుస్తుంది. కనుక చందా వివరములను పత్రికలో ప్రచురించటం లేదు. ప్రేరేపించబడిన వారు ఆన్‌లైన్ ద్వారాగాని, మనియార్డరు ద్వారాగాని, స్వయముగా గాని అందించవచ్చును. అలా పంపిన వారు 9866716506 ద్వారా మాకు తెలియజేయ మనవి. – చీఫ్ ఎడిటర్

# North East West South వార్తలు

## పాస్టరుపై అమానుష దాడి

ఆదిలాబాద్ జిల్లాలోని చిమాపూర్ గ్రామంలో ప్రార్ధన సమావేశం జరిపి ఇంటికి తిరిగి వెడుతున్న పాస్టర్ ప్రభుదాస్‌పై గత డిసెంబర్ 7వ తేదీన దాడి జరిగింది. ఆరెస్సెస్, బిజెపి గూండాలు ప్రభుదాస్ మీద ఆకస్మికంగా దాడి చేసి కొట్టారు. ఈ సంఘటన రాత్రి ఏడుగంటల సమయంలో జరిగంది. కర్రలతో బాదినందున పాస్టరు తీవ్రంగా గాయపడ్డాడు. ఎడమ చేయి విరిగిపోయింది. రోడ్డు మీద పడిపోయిన పాస్టరును, కొందరు చూచి, ఆదిలాబాద్‌లోని ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్ళారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. ఆదిలాబాద్ జిల్లా భైంసా మండలంలోని కాంతినగర్‌లోగల నలభై క్రైస్తవ కుటుంబాలకు గత ముప్పై సంవత్సరాలుగా బేతేలు చర్చిలో సేవ చేస్తున్నారు. ఆ ప్రాంతంలోని పాస్టర్ల అసోసియేషన్‌లో ఆయన సీనియర్ నాయకుడు. ప్రభుదాసు భార్య యేసుమణి (50) ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## పులివెందులలో వై.యస్. క్రిస్‌మస్ వేడుకలు

ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు స్వస్థలమైన పులివెందులలోని సి.ఎస్.ఐ. చర్చిలో క్రిస్‌మస్ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు. చర్చి ఫాదర్ ఐజక్ వరప్రస్తాని ఆధ్వర్యంలో ఈ ప్రార్ధనలు జరుపబడినాయి. ప్రార్ధనల అనంతరం ముఖ్యమంత్రి క్రిస్‌మస్ కేకును కట్ చేశారు. ముఖ్యమంత్రితో పాటు చర్చికి వచ్చిన వారిలో ఆయన సతీమణి, కడప ఎం.పి. వై.యస్. వివేకానందరెడ్డి, ముఖ్యమంత్రి వియ్యంకుడు ఇ.సి.గంగిరెడ్డి, వై.యస్. కుమారుడు జగన్మోహనరెడ్డి ప్రభృతులు వున్నారు.

**శ్రీమతి విజయలక్ష్మి మనోగతం :** ముఖ్యమంత్రి శ్రీ వై.యస్. రాజశేఖరరెడ్డి సతీమణి శ్రీమతి విజయలక్ష్మి క్రిస్‌మస్ పండుగ సందర్భంగా కొన్ని విషయాలు వెల్లడించారు. 'మా మామయ్యగారి గనులకు సంబంధించి భాగస్వాములతో గొడవలు వుండేవి. 1977 మే నెల ఆరవతేదిన ఒక దురదృష్టకరమైన సంఘటన జరిగింది. ఆ రోజున ఒక వ్యక్తి మా వారిని హైదరాబాద్ రావలసిందిగా టెలిగ్రాం ఇచ్చారు. అప్పుడు మా వారు హైదరాబాద్ వెళ్ళారు. సెక్రటేరియట్‌లో మా వారు మాట్లాడుతుండగా, ఒక వ్యక్తి తుపాకితో కాల్పులు జరిపాడు. శబ్దం విని మా వారు క్రింద పడిపోయాడు. ఒక బుల్లెట్ మా వారి చేతికి తగిలింది. మా వారితో మాట్లాడుతున్న వ్యక్తి బుల్లెట్ గాయాలతో వెంటనే మరణించాడు. నా భర్తను ఆ ప్రభువు కాపాడాడు. ఈ అద్భుతం ద్వారా దేవుడు నాకు, నా పిల్లలకు నూతన జీవితం ప్రసాదించాడు. నేను క్రీస్తును నమ్మిన తర్వాత చాలా లోతుగా ప్రార్ధించాను. ఇప్పుడు దేవుడు నా చేయి విడువకుండా పట్టుకున్నాడు' అని తన మనోగతాన్ని వివరించారు.

APTEL/2003/10317 Postal Regd. No. SSP/ONG-02/06-08
Posting Date 1 st of Every Month at R.M.S.

నశించిన దానిని వెదకి రక్షించుటకు
మనుష్యకుమారుడు ఈ లోకమునకు వచ్చెను.

- యేసుక్రీస్తు ప్రభువు చెప్పెను

# HANNAKRUPA

## Devotional Monthly Magazine

The Undenominational Church of the Lord in India
Post Box No. 51, Krupadanam Street, Cloughpet, ONGOLE- 523 001, A.P., S. India,
e-mail : hannakrupa@yahoo.com, ucli _ ucli @ yahoo.co.in
Phone : 9346261483

Chief Editor : K. Samuel Rajendra
Cell: 9866716506

Edited, Published & Owned by Dr. K. Samuel Rajendra, B.A., Krupadanam Street, Cloughpet, Ongole - 523 001 and
Printed by K. Emmanuel Rajendra, B.A., B.L., Printed at Hanna Krupa Printing Press
5th Lane, Cloughpet, Ongole, Prakasam Dist., A.P.